
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 10 జనవరి 2024 | 5



చెత్త వాహనాలకు బ్రేకులు పడ్డాయ్..



కొవ్వూరులో నిలిపివేసిన చెత్త వాహనం

ఎక్కడ చెత్త అక్కడే!

సీఎం గారూ.. ఇదేనా చె(చి)త్తశుద్ధి

ఏం ప్రభుత్వమో ఏంటో.. సమస్యలు పరిష్కరించమన్నా స్పందించడంలేదు.. ఇచ్చిన హామీలు నెరవేర్చమన్నా పట్టించుకోవడంలేదు..గతంలో మునిసిపల్ కార్మికుల సమ్మె అంటే సర్కారు ముందుగానే దిగొచ్చేది.. వద్దు బాబూ మీ సమస్యలేంటో చెప్పండి.. మేం తీరుస్తాం అంటూ బుజ్జగించే వారు.. విధుల్లోకి రప్పించేవారు.. మరి నేడు.. అసలు సర్కారు పట్టించుకోవడమే లేదు.. ఏం చేసుకుంటారో చేస్కోండి.. మేం స్పందించేది లేదంటూ భీష్మించుకుని కూర్చుంటుంది..ఒక పక్కన మునిసిపాలిటీల్లో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోతూనే ఉంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతూనే ఉంది.. దోమలు విజృంభిస్తూనే ఉన్నాయి.. కంపు భరించలేం అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయినా సర్కారు మాత్రం దిగిరావ డంలేదు. ఎవరేమైతే మాకేంటి అనే ధోరణిలో ఉంది పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా పట్టణాలు కంపు కొడుతున్నాయి.. ఏ రోడ్డు చూసినా చెత్తతో దర్శనమిస్తోంది. జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు ఉన్నాయి. కొవ్వూరులో గత నెల 27వ తేదీ నుంచి కార్మికులు సమ్మెలోకి దిగారు. దీంతో వీధులన్నీ ఎక్కడికక్కడ చెత్తతో దర్శనమిస్తున్నాయి. ఇక రాజమహేంద్రవరం కార్పొరేషన్, నిడదవోలు మునిసిపాలిటీలో ఈ నెల 3వ తేదీ నుంచి సమ్మె బాటపట్టారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. అయితే ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు విధుల్లో ఉంటే ఔట్ సోర్సింగ్ కార్మికులు మాత్రం ఆందోళనలో ఉన్నారు. మూడు పట్టణాల్లో మొత్తంగా 973 మంది సమ్మె చేస్తున్నారు. కేవలం 406 మం ది పర్మినెంట్ ఉద్యోగులు మాత్రమే పనులు చేస్తున్నారు. పారి శుధ్య పనులు చేయలేక అష్టకష్టాలు పడుతున్నారు.చాలా చోట్ల మేం చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు.ఇదిలా ఉండగా రెగ్యు లర్ ఉద్యోగుల పనులను అడ్డుకుంటే కానీ ప్రభుత్వం దిగిరాదనే యోచనలో ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు



కొవ్వూరులో రోడ్డుపై చెత్త కుప్ప

- 973 మంది కార్మికుల సమ్మెబాట
- అధ్వానంగా తయారైన పట్టణాలు
- చెత్తచెత్తగా మారుతున్న వీధులు
- జిల్లాలో మూడు పట్టణాల్లో ఇదీ తీరు
- విధుల్లో 406 మంది కార్మికులు
- పనులు చేయలేక అవస్థ
- ప్రభుత్వంతో ఫలించని చర్చలు
- కొవ్వూరులో 15 రోజులుగా..
- రాజమహేంద్రవరం, నిడదవోలులో 7 రోజులుగా ఆందోళన



నగరం కంపు కొడుతోంది..!

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 : నగరంలో ఎటు చూసినా చెత్త.. ఎక్కడ చూసినా చెత్త.. ఏడు రోజుల కిందటి వరకూ క్లీన్‌గా ఉంటే నగరం నేడు చెత్త చెత్తగా మారింది.అయినా పట్టించుకున్నవారు లేరు.. చెత్త సమస్యను పరిష్క రించిన వారూ లేరు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు గత 7 రోజులుగా సమ్మె బాటపట్టారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఈ నెల 3 నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. నగరంలో 20సర్కిల్స్ పరిధిలో 20 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. 50 మంది మేస్త్రీలు ఉన్నారు. వారిలో 19 మంది ఔట్‌సోర్సింగ్ మేస్త్రీలు ఉన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో సుమారు 340 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు ఉన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో సొసైటి ద్వారా విధులు నిర్వహిస్తున్న 742 మంది పారిశుధ్య కార్మికులు, 42 మంది డ్రైవర్లు సమ్మె చేస్తున్నారు. నగరంలో ఒక్కసారిగా 784 మంది తాత్కాలిక కార్మికులు విధులు నిలుపుదల చేసి సమ్మెలోకి వెళ్లడంతో కథ అడ్డం తిరిగింది. జగన్ పాదయాత్రలో ఉండగా 2006కు పూర్వం నుంచి విధుల్లో ఉన్న కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో కార్మికులు రోడ్డెక్కారు. 742 మంది చేయాల్సిన పనిని 340 మంది పర్మినెంట్ కార్మికులు పనులు చేయలేక అవస్థలు పడుతున్నారు. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు పనులు చేయకుండా ఔట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకుంటే నగరం కంపుకొట్టడం ఖాయం.

నిడదవోలులో అధ్వానం



నిడదవోలు మెయిన్‌రోడ్డులో ఇలా..

నిడదవోలు, జనవరి 9 : నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. ఏ రోడ్డులో చూసినా అంతా చెత్తమయం.ఆ రోడ్ల మీద నుంచే ప్రజాప్రతినిధులు, అధికా రులు ప్రయాణిస్తున్నా వారికి కనీసం రోడ్లపై పేరుకుపోయిన చెత్త కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ పరిధిలోని 28 వార్డుల్లో సుమారు 45 వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. పట్టణంలో ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు 91 మంది ఉండగా పర్మినెంటు పారి శుధ్య కార్మికులు 29 మంది మాత్రమే ఉన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం.. ఇంటింటా చెత్త సేకరణ చేయడం మొత్తం 120 మంది విధి నిర్వహణ. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు 91 మంది సమ్మె బాట పట్టడంతో కేవలం 29 మందిపై ఆ భారం పడింది. దీంతో ఎక్కడా చెత్త శుద్ధి కానరావడంలేదు. గత 7 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పారిశుధ్య కార్మికులు మండిపడుతున్నారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నిడదవోలులో ఇలా..

కొవ్వూరులో కంపు..కంపు

కొవ్వూరు, జనవరి 9 : మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెతో కొవ్వూరు పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పట్టణంలోని ప్రధాన రహదారుల నిండా చెత్తే. సంక్రాంతి పండుగ రోజుల కావడంతో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పనులు చేపడతారు. ఇంట్లో ఉన్న పాత సామగ్రి, చెత్తను రోడ్ల పక్కన పడేస్తున్నారు.దీంతో చెత్త విపరీతంగా పేరుకుపోతోంది. కొవ్వూరు మునిసిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు గత నెల 27వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. అంటే సుమారు 15 రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో పట్టణంలో ఎటు చూసినా చెత్త దర్శనమిస్తుంది. కొవ్వూరు మునిసి పాలిటీలో 98 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెకు దిగారు. ప్రస్తుతం 37 మంది రెగ్యులర్ కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో వివిధ పనుల నిమిత్తం 11 మంది వెళ్లిపోతుంటే కేవలం 26 మందిపైనే భారమంతా పడిపోతోంది. పట్టణమంతా స్వీపింగ్, చెత్త సేకరణకు రెండు రోజులు పడుతుంది. దీంతో పారిశుధ్యం అధ్వానంగా తయా రైంది. చెత్త ప్రతిరోజు సేకరించకపోవడంతో రహదారులు అపారిశుధ్యానికి నిలయంగా మారుతున్నాయి.



కొవ్వూరులో పేరుకుపోయిన చెత్త

ప్రభుత్వంతో చర్చలు విఫలం

మంత్రులు, కార్మిక సంఘాల నేతల మధ్య ఈ నెల 6వ తేదీన చర్చలు జరిగాయి.చాలా డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో పారిశుధ్య కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు.

1. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ప్రస్తుతం అందజేస్తున్న వేతనం రూ.15,000లు, హెల్త్ అలవెన్సు రూ. 6000లు కలిపి రూ. 21000లు ఇస్తుంది. దీనికి అదనంగా ఒక నెల బోనస్ లేదా రూ. 3000లు జీతం పెంచాలని అడగ్గా ప్రభుత్వం ఒక్క రూపాయి పెంచేది లేదన్నారు. రాజధాని, విలీన గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్మికులకు రూ. 21,000 వేతనం చెల్లించేందుకు అనుమతించింది.కొత్తగా తీసుకున్న కార్మికుల విషయం తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పింది.
2. జనవరి 1వ తేదీన ఇచ్చిన జీవో పరిధిలోకి వచ్చే పారిశుధ్య డ్రైవర్లు, క్లీనర్లు, అండర్ గ్రౌండ్ పారిశుధ్య కార్మికులకు రూ. 6000 హెల్త్ అలవెన్స్ అమలు చేస్తారు. వారందరికీ క్లీన్ ఎన్విరాన్‌మెంటల్ వర్కర్స్‌గా పేరు పెట్టి భవిష్యత్‌లో రూ. 21000ల బేసిక్‌పై వేతనాలు పెంచుతారు.
3. స్కూల్ స్వీపర్లకు బకాయి వేతనాలు త్వరలోనే చెల్లిస్తారు.
4. ఫైనాన్స్ డిపార్టుమెంటులో పెండింగ్‌లో ఉన్న స్కిల్, సెమీ స్కిల్డ్ వేతనాలు వర్తించే 8 కేటగిరీలకు చెందిన ఫైల్ వారంలో క్లియర్‌చేసి వేతనాలు చెల్లిస్తారు. ఇంజనీరింగ్ కార్మికులకు 11వ పీఆర్‌సీ ప్రకారం బేసిక్ రూ. 20 వేలు చెల్లించాలని కోరగా ప్రభుత్వం తిరస్కరించింది. ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, వాటర్ సప్లయి కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని కోరగా తిరస్కరించింది.
5. సర్వీస్‌లో ఉండి ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ. 5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతారు. సహజ మరణానికి రూ2 లక్షలు అందజేస్తారు.యూజీడీ విభాగంలో వర్కరు ప్రమాదవశాత్తు చనిపోతే సుప్రీంకోర్టు డైరెక్షన్ ప్రకారం అతడికి రూ. 30 లక్షలు, పూర్తి అంగవైకల్యానికి రూ. 20 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ. 10 లక్షలు నష్ట పరిహారం అందజేస్తారు.
6. పర్మినెంట్ వారికి సరెండర్ లీవులు 10 రోజులు ఇస్తారు. జీపీఎఫ్ ఖాతాలు త్వరలో తెరుస్తారు.
7. ఇంజనీరింగ్ విభాగంలో సర్టిఫికెట్స్ లేనివారికి స్కిల్ డెవలప్‌మెంటు ద్వారా శిక్షణ అందించి సర్టిఫికెట్స్ ఇస్తారు.
8. పదేళ్లు పైబడిన కార్మికులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 50 వేలు అందిస్తారు. 25 ఏళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉంటే ఏడాదికి రూ. 2000ల చొప్పున అదనంగా చెల్లిస్తారు.
9. క్లాప్ ఆటోల డ్రైవర్లకు సంక్రాంతి తరువాత చీఫ్ సెక్రటరి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీలు కార్మికులతో చర్చలు జరిపి వేతనాల పెంపుదలకు చర్యలు తీసుకుంటారు.
10. మట్టి ఖర్చులు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంపు.
11. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలుచేస్తారు. ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదు.

ఇవీ నాయకుల డిమాండ్లు..

1. సమానపనికి సమాన వేతనం.
2. ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి.
3. పర్మినెంట్ చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పడంతో ఔట్ సోర్సింగ్‌లో ఐదేళ్ల అనుభవం ఉన్న కార్మికులందరిని కాంట్రాక్టులోకి మార్చాలి.
4. అందరికి జీతాలు పెంచాలి. 11వ పీఆర్‌సీ లింక్ చేయాలి.
5.జీవోఆర్‌టీ నంబరు 1615 ప్రకారం బేసిక్ డీఏ ఇవ్వాలి.
6. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే వర్కర్లకు రిస్క్ అలవెన్సు, హెల్త్ అలవెన్సు ఏదో ఒకటి పెంచి ఇవ్వాలి.
7. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఒక నెల బోనస్ లేదా రూ. 3000లు జీతం పెంచాలి.
8. రూ. 5 లక్షలు గ్రాట్యుటీ అమలు చేయాలి.

అడిగేవారెవరు..పీకెయ్!

రాజమహేంద్రవరం రూరల్‌లో 33 మంది.. నిడదవోలులో 9 మంది వలంటీర్ల తొలగింపు?



నిడదవోలు, జనవరి 9 :మాట వింటే ఓకే.. లేకపోతే షాకే.. ఇదీ సీఎం జగన్ నైజం.. ఇటీవల వలంటీర్లకు వైసీపీ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ల వ్యవస్థను తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిని నియమించింది..గత నాలు గేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్నారు.రాష్ట్రంలో ఎన్నికలు రానున్న తరుణంలో వలంటీర్ల పనితీరు సరిగ్గా లేదనే నెపంతో జిల్లావ్యాప్తంగా ఎందరో వలంటీర్లను పొమ్మనలేక పొగ పెట్టి ఇళ్లకు పంపించేసింది.అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయక పోవడమే ఉద్వాసనకు ప్రధాన కారణమనేది ఒక వలంటీర్ ఆవేదన. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 125 మందిని తొలగించింది. వలంటీర్లను నియమించేది స్థానిక సంస్థలైతే.. తొలగించేది మాత్రం విజయవాడలో ఉన్న వలంటీర్స్ అండ్ సెక్రటరీస్ డిపార్ట్‌మెంటు నుంచి ఆదేశాలు రావడం విశేషం. గతంలో రాజమహేంద్రవరం రూరల్ మండలంలో సుమారు 33 మంది వలంటీర్లను అర్థంతరంగా తొలగించారు. సమ్మెకు దిగారనే కారణంతో తొలగించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా నిడదవోలులో 218 మంది వలంటీర్లు ఉండగా 9 మందిని తొల గించారు. దీనిపై వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లకు విధి నిర్వహణకు నిర్దిష్ట సమయం లేకపోయినా ఒకటో తేదీ తెల్లవా రుజాము నుంచే పింఛన్లు పంపిణీ చేస్తారు.వలంటీర్లల సేవల్లో ఎక్క డైనా లోపం తలెత్తితే సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించకుండా ఇటికి పంపించేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగులు తప్పు చేస్తే వలంటీర్లలాగే ఈ వైసీపి ప్రభుత్వం వారిని కూడా ఇంటికి పంపిస్తుందా అంటూ వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. అధికారపార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తితేనే వలంటీర్లుగా కొనసాగగలమని లేకపోతే ఇంటికి వెళ్లక తప్పదనేది వాలంటీర్ల వాదన. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల విధుల నుంచి తమను ఎందుకు తొలగించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు బెదిరింపులు



రాజానగరంలో పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీ ఉద్యోగులకు నోటీసులు
- నాలుగు రకాలుగా అందించే వైనం
- పాఠశాలలకు సెలవు.. పిల్లలకు భోజనమెలా
- సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లదే వంట

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ ఉద్యోగులను రకరకాలుగా భయపెడుతున్న ప్రభుత్వం నోటీసులిస్తోంది. ఎస్మా ప్రయోగించినప్పటికీ ఉద్యోగులు దిగిరాకపోవడంతో పాటు ఉద్యమాన్ని ఉధృతం చేసిన సంగతి తెలిసిందే.గత 28 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకూ 24 గంటల నిరవధిక సమ్మె చేశారు. దీనిలో భాగంగా చలిలో పిల్లలతో కలిసి నిద్రించి నిరసన తెలిపారు. ఎస్మా జీవో పత్రాలను ఇప్పటికే అనేక చోట్ల దహనం చేశారు. రోజురోజుకు ఆందోళన ఉధృతమవుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు విధుల్లో చేరాలని నోటీసులు ఇస్తున్నారు. రెండు రోజులుగా నోటీసులివ్వడం మొదలు పెట్టారు.వీటిని నాలుగు రకాలుగా వారికి అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక నోటీసును అంగన్‌వాడీ కేంద్రం వద్ద గోడకు అతికిస్తారు. ముందుగా ఫోన్ చేసి కూడా చెబుతారు. అక్కడకు రాకపోతే సచివాలయ ఉద్యోగులు స్వయంగా ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేస్తారు. అక్కడ సదరు ఉద్యోగి లేకపోతే ఇంటి గోడకు అతికిస్తారు. ఇరుగుపొరుగుకు చెందిన ఇద్దరి చేత సంతకం చేయించుకుంటారు. అంతేకాక ప్రభుత్వం రిజిస్టర్‌పోస్టులో కూడా నోటీసు పంపించే పనిలో ఉంది.ఐసీడీఎస్ ఉద్యోగుల ద్వారా కూడా నోటీసులు ఇవ్వనున్నారు. ఇలా కొంతమందినైనా భయపెడితే డ్యూటీలో చేరతారనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. కానీ తమ జీతం పెంచకుండా, తమ సమస్యలు పరిష్కరించకుండా తాము డ్యూటీకి రాలేమని, పరిష్కారం దొరికే వరకూ సమ్మెలోనే ఉంటామని చెబుతున్నారు.అక్కడక్కడా వైసీపీనేతలు, అధికారుల ఒత్తిడి వల్ల ఒకరో ఇద్దరో విధులకు హాజరవుతుండడం గమనార్హం. కానీ జిల్లాలో 15 వేల సెంటర్లలో సుమారు 30 వేల మంది వరకూ ఉద్యోగులు ఉన్నారు. వారు నోటీసులను కూడా తిరస్కరిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా వంటా వార్పు బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై పడింది. ఇటీవల పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇచ్చి సంగతి తెలిసిందే. అంతకు ముందు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం కింద పిల్లలకు పెట్టే భోజనం కొంత తెచ్చి, ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఏదో పెట్టినట్టు పని పూర్తి చేశారు.పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో సొంతంగా వండి పెట్టవలసిన పరిస్థితి వచ్చింది.

అన్నింటికీ తెగించే సమ్మెలోకి వచ్చాం

అంగన్వాడీల సంఘు జిల్లా ప్రధాన కార్యదర్శి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాకు అంగన్వాడీలు భయపడరని, అన్నింటికీ తెగించే సమ్మెలోకి వచ్చాం అని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట 29వ రోజున మంగళవారం అంగన్వాడీల నిరవధిక సమ్మె కొనసాగింది. ప్రభుత్వం కాలయాపన చేయకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రులు, సలహాదారులు, ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీల పట్ల బెదిరింపులకు దిగుతున్నారని, అయినా ఏ ఒక్కరూ వెనుకడుగు వేయలేదన్నారు. అంగన్వాడీల దీక్షకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నామణి, కోశాధికారి వెంకటలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా మద్దతు పలికారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : సమస్యలు పరిష్కరించకపోతే 23వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని 108 ఉద్యోగులు హెచ్చరించారు. ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జేసీ తేజ్‌భరత్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ, జిల్లా కార్యదర్శి గుజ్జుల రమేష్‌బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు వీఎస్ నారాయణ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న తమను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరుస్తామని జగన్మోహనరెడ్డి 2019లోనే హామీ ఇచ్చారని, నాలుగేళ్ల నుంచి సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, రమేష్‌నాయుడు, నాగరాజు, లోహి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో టీడీపీ ఐవీఆర్‌ఎస్ సర్వే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో మూడుసార్లు సర్వేలు నిర్వహించినట్టు చెబుతున్నారు.అది ప్రజల్లో చేసిన సర్వే.వాటి తర్వాత ప్రస్తుతం పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఇంట్రేక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్‌ఎస్) ద్వారా సర్వే చేస్తున్నారు.కార్యకర్తలకు ఫోన్‌లు వస్తాయి.ఫలానా వ్యక్తిపై మీ అభిప్రాయం ఏంటని అడుగుతారు.దానికి వాళ్లు ఇచ్చిన ఆప్షన్ మేరకు అభిప్రాయం చెప్పాలి.ఇప్ప టికే గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలులో ఐవీఆర్‌ఎస్ సర్వే జరిగింది. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదు.ఈలోపు మరింతగా అభి ప్రా యాలు తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేస్తారు.టీడీపీ -జనసేన పొత్తు వల్ల కొన్ని సీట్లను జనసేనకు కేటాయించనున్నారు.అవి ఎన్ని అనేది స్పష్టత లేదు.

షోకాజులకు బెదిరేది లేదు : ఎస్ఎస్ఏ

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తామని బెదిరిస్తున్నారని.. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకూ అలాంటి హెచ్చరికలకు తలొగ్గేది లేదని సమగ్ర శిక్షా ఉద్యోగులు స్పష్టం చేశారు.జేసీ తేజ్‌భరత్‌కు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. 21వ రోజు సమ్మెను కొనసాగించారు. రాష్ట్ర జేఏసీ సూచనల ప్రకారం నడుచుకుంటామని జిల్లా జేఏసీ నాయకులు పేర్కొ న్నారు. తొలుతగా అనకాపల్లి జిల్లా మునపాక మండల విద్యాశాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ మృతి చెందిన జిద్దు వాసు దేవరావుకు నివాళులర్పిస్తూరెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

వైసీపీ గెలిచేది ఐదు సీట్లే!

- 170 స్థానాల్లో టీడీపీదే విజయం
- వైసీపీ డౌన్‌ఫాల్ ఆరంభమైంది
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: రాష్ట్రంలో వైసీపీకి 5 స్థానాలు మాత్రమే ఎందుకు రాకూడదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారని మీకు వైనాట్ 175 అని ప్రశ్నించారు. 170 టీడీపీకి వస్తాయని పైన ఆ ఐదు సీట్లు ఖచ్చితంగా వైసీపీకి రావొచ్చునని చెప్పారు. ఈ రోజు మొదలుకొని వైసీపీ డౌన్‌ఫాల్ ఆరంభమైందన్నారు. ఇప్పటికే అనేక తప్పిదాలు చేసిన సీఎం జగన్‌తో సహ ఆయన సలహాదారులు, ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు భయపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఇష్టానుసారం వ్యవహరించే అధికారులు వారి పద్ధతి మార్చుకోవాలన్నారు. కేంద్రం దయ వల్ల జగన్ బెయిల్‌పై బయట ఉన్నాడనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏమిచేశాడో తెలియడంలేదన్నారు.సంక్షేమం ముసుగులో దోపిడీ చేశాడని ధ్వజమెత్తారు. వాగ్దానాలు చేసి మాట ఇచ్చి మడమతిప్పిన ఈ సీఎం వల్ల ఎస్ఎస్ఏ ,అంగ న్వాడీలు , మునిసిపల్ కార్మికులు రోడ్డుపాలయ్యారని చెప్పారు. అప్పులు పెంచాడు తప్ప రాష్ట్రాన్ని ఉద్ధరించలేదన్నారు. శాడిస్ట్ ముఖ్యమంత్రి జగన్, శాడిస్ట్ సలహాదారులు రాష్ట్రాన్ని అబాసుపాలు చేశారని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఉరి వేశాడని విమర్శించారు. ఇలాంటి సీఎంను ఏ రాష్ట్రం కూడా చూసి ఉండదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తలారి మూర్తి , పిన్నింటి ఏకబాబు, ప్రత్తిపాటి రామారావు చౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

పండుగ సెలవులు తీసిన ప్రాణాలు!







ఆనందం ఆవిరైంది.. సరదా ప్రాణం తీసింది.. పండుగ సెలవుల తొలిరోజే ముగ్గురు విద్యార్థుల ప్రాణాలు బలిగొన్నాయి. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రంపచోడవరం మండలం ఐ. పోలవరం వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వెళ్లారు. చాలా సేపు సరదాగా గడిపారు. ఫొటోలు తీసుకుంటుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. దేవరపల్లి యర్నగూడెంలో ట్రాక్టర్ కిందపడి మరో విద్యార్థి మృతిచెందాడు. - వివరాలు 7లో



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ శ్రేణులు

నేడు తునికి చంద్రబాబు రాక

- రా కదిలిరా సభలో ప్రసంగించనున్న టీడీపీ అధినేత
- సభా ప్రాంగణంలో పూర్తయిన భారీ ఏర్పాట్లు

తుని రూరల్, జనవరి 9: టీడీపీ, జనసేన పొత్తు అనంతరం పార్లమెంట్ పరిధిలో టీడీపీ అధినేత చంద్రబాబు తొలి సభ కావడం, చంద్రబాబు అక్రమ అరెస్ట్, విడుదల, జగన్‌పాలనలో మోసపోయి రోడ్డెక్కిన వివిధ వర్గాల ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో తునిలో సభ జరగడంతో చంద్రబాబు సభకు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో పార్లమెంట్ పరిధిలో తొలిసభ కావడంతో మాజీమంత్రి, ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు నేతృత్వంలో కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బండారు సత్యనారాయణమూర్తి, జిల్లాఅధ్యక్షుడు జ్యోతుల నవీన్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలు సభ ఏర్పాట్లును పర్యవేక్షించారు. కాకినాడ పార్లమెంట్‌లో 7నియోజకవర్గాలతో పాటుగా పాయకరావుపేట, నర్సీపట్నం, తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణంవద్ద భారీ ఏర్పాట్లు చేశారు.

● భారీ వేదిక ముస్తాబు

తునిలో చంద్రబాబు సభకు పక్కాఏర్పాట్లు చేశారు. లక్షమంది జనసమీకరణతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. వేదిక నిర్మించడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కె ఈవెంట్స్ బృందం స్టేజ్ఏర్పాటు పనులు శరవేగంగా చక్కబెడుతోంది. ఏపీలో ఎక్కడ సభ జరిగితే అక్కడ వేదిక నిర్వహించే ఈ బృందం 48గంటల ముందే చేరుకుని 10వాహనాలతో 100కు పైగా కార్మికులతో పగలు, రాత్రి శ్రమించి పనులు పూర్తిచేశారు. వేదికపై 80 మంది కూర్చోవడానికిసరిపడా నిర్మాణం పూర్తి చేశారు. 60 అడుగులు పొడవు, 40అడుగుల వెడల్పు, 5అడుగుల ఎత్తులో వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

● సభకు పోలీసుల పర్యవేక్షణ

తునిలో చంద్రబాబు సభను పర్యవేక్షించేందుకు పోలీస్ అధికారులు సన్నద్ధమయ్యారు. నేడు జరుగనున్న సభకు పెద్దఎత్తున జనాలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటికే డీఎస్పీ లతాకుమారి సభా ప్రాంగణంవద్ద ఏర్పాట్లు, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. 150మంది పైబడి పోలీసులు చంద్రబాబు సభ వద్ద విధులు నిర్వహించనున్నారు. భారీ వాహనాలు దారి మళ్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో జాతీయ రహదారి గుండా వచ్చేవాహనాలను జగన్నాధగిరి కూడలిమీదుగా రైల్వే బ్రిడ్జి కింద నుంచి సభావేదిక వద్దకు వాహనాలు రప్పించేందుకే ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలకు, వీఐపీలకు, సాధారణ కార్యకర్తలకు, ఆటోలకు, ద్విచక్రవాహనాలకు ఇప్పటికే పార్కింగ్ ప్రాంగణాన్ని నిర్దేశించి ఐడెంటీ బోర్డులు ఏర్పాటు చేశారు.

● చంద్రబాబు షెడ్యూల్ ఇలా

బొబ్బిలిలో సభ ముగించుకుని మధ్యాహ్నం 3.30గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 3.35గంటలకు చామవరంహెలిప్యాడ్‌వద్ద ల్యాండ్‌కానున్నారు. 3.45 గంటలకు ఎస్.అన్నవరం పరిధిలో గల సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3.45 నుంచి 5.45 వరకు బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. 6గంటలకు తుని నుంచి బయలుదేరి 8గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- జగన్ అడ్డగోలు హామీలతో అన్నివర్గాలు రోడ్డున పడ్డాయి
- రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం ఎంతో ఉంది
- తుని మీడియా సమావేశంలో టీడీపీ నాయకుల వెల్లడి

తుని రూరల్, జనవరి 9: వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని జగన్ అడ్డుగోలు హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా ముంచాడని తునిలో టీడీపీ నేతలు మీడియా సమావేవంలో ధ్వజమెత్తారు. బుధవారం జరగనున్న సభ ఏర్పాట్లు, వైసీపీ ప్రభుత్వవిధానాలపై మాజీ మంత్రి, ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ మూర్తి, చింతకాయల అయ్యన్నపాత్రుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ న్యాయపరమైన హక్కులు నెరవేర్చాలని, ఇచ్చిన హామీలునెరవేర్చాలంటూ అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు ఒప్పంద కార్మికులు రోడ్లు ఎక్కితే జగన్ ప్రభుత్వం స్పందించకపోగా వారిని భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ప్రజలు కష్టాల్లో వారికి తోడుగా టీడీపీ ఎప్పుడు ఉంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం ఎంతైనా ఉందని నాడు తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ పిలుపుకు ఎంతటి స్పంద న వచ్చిందో అదేరీతిలో చంద్రబాబురా కదలిరా పిలుపుకు ప్రజలు ఉప్పెనలా తరలివస్తున్నారన్నారు. నేడు జరుగనున్న చంద్రబాబు సభకు పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి అంచనాకు మించి ప్రజలు చేరుకునే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇప్పటికే టీడీపీ, జనసేన కార్యకర్తలు ఈ సభను విజయవంతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, టీడీపీ నాయకులు ముదులూరి మురళీ కృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



కార్పొరేషన్‌కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో అక్కినేని వనజ

తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తాం

- మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 : ముఖ్యమంత్రి జగన్ గారు రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలు ఇప్పటికైనా పరిష్కరించి సమ్మెను విరమింపజేస్తారా లేక తాడేపల్లి ప్యాలెస్ ముట్టడించమంటారా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 6వ రోజు మంగళవారం కలిసి మద్దతు తెలిపారు. పారిశుధ్య కార్మికులు సమ్మెతో ఆగిన పనులు చేయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయింపులు చేసే కంటే డిమాండ్స్‌ను నేరవేరిస్తే మంచిదన్నారు. జగన్ ఇచ్చిన హామీలనే నేరవేర్చకుండా ద్రోహం చేశారన్నారు. నిర్లక్ష్యం వీడకపోతే రెగ్యులర్ కార్మికులు చేసే పనులను ఔట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకుంటారని హెచ్చరించారు. మరొక పక్క నగరంలో చెత్తపేరుకుపోవడంతో పారిశుధ్య కార్మికులు సమ్మెను విరమింపచేయాలని కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని కార్మిక నేతలు తెలిపారు. మహా ధర్నాలో కార్మికులు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రెడ్డిరమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద, ఎం శివ, గిరి, భాగ్యలక్ష్మి, ముత్యాల పోలమ్మ పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీ పార్టీలను చిత్తుగా ఓడించాలి

- రైతులు, కార్మికులు, వర్కర్లను విస్మరించిన పార్టీలు
- 2024 ఎన్నికలు దేశ ప్రజలకు చాలా కీలకం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : రైతాంగ సమస్యలపై ప్రతి ఒక్కరూ రాజీలేని పోరాటం చేయాలని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని రాష్ట్రంలో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రైతు ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రరంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు రెండోరోజైన మంగళవారం హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలకు కార్పొరేట్ కంపెనీలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సబ్సిడీలు కూడా ఇవ్వకపోవడంతో రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ రామమందిరాన్ని తెరపైకి తెచ్చారని, అయోధ్య రామమందిరంలో విగ్రహప్రతిష్ఠకు వేలకోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలు దేశప్రజలకు చాలా కీలకమైనవని, లౌకికవాదం కావాలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న బీజేపీ కావాలో ప్రజలు తేల్చుకోవాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన ముఖ్యమంత్రులతో పోల్చుకుంటే జగన్మోహనరెడ్డిలాంటి నియంత మరొకరు లేరన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఏ ఒక్క హామీ జగన్ అమలు చేయలేదన్నారు. దీంతో వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలో వర్కర్లు, ఉద్యోగస్తులు సమ్మెబాట పడితే జగన్మోహనరెడ్డి పోలీసులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మా నాయకుడు మాట తప్పడు, మడమ తప్పడు. మోకాలు తిప్పడు, ఏం చెబితే అది చేస్తాడు అంటూ వైసీపీ నేతలు పదే పదే భజన చేస్తుంటారని, కానీ జగన్మోహనరెడ్డి చట్టాన్ని అంగీకరించడు, కోర్టు చెప్పింది వినడు. చివరకు తాను చెప్పింది కూడా అమలు చేయడు అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఆయా జిల్లాల రైతు ప్రతినిధులు మాట్లాడారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రామచంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కాటమయ్య, డేగా ప్రభాకర్, జమలయ్య లక్ష్మి, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘం రాష్ట్ర సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లారీ ఢీకొని ఒకరి మృతి

ఆలమూరు, జనవరి 9: ఆలమూరు మండలం పెదపళ్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన ఈతకోట శ్రీనివాసరావు(45) వెదురుమూడి వెళ్లి కొత్తూరు సెంటర్ వైపు ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వస్తుండగా పెదపళ్ల కోళ్లఫారం సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఈమేరకు ఆలమూరు ఎస్ఐ శీనునాయక్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావులపాలెం పోలీసుస్టేషన్‌పై ఏసీబీ అధికారుల దాడి

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్




ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఎస్ఐ వెంకటరమణ, ఆపరేటర్ సత్యప్రసాద్

రావులపాలెం, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్‌లు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరుకు చెందిన సత్తి విజయ రామ కృష్ణారెడ్డి జియో ఫైబర్ డిస్ట్రి బ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల రావుల పాలెంలో జియో ఫైబర్ డిస్ట్రి బ్యూటర్‌కు చెందిన ఫైబర్ నెట్ కేబుల్ కారణంగా ఒక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మరణించాడని ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో విజయరామ కృష్ణారెడ్డిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఎఫ్ఆర్ఐ నమోదులో తక్కువ శిక్ష పడే సెక్షన్(304ఏ) వేసి స్టేషన్ బెయిల్ ఇచ్చే విధంగా చేస్తామని దానికి రూ.లక్ష లంచం ఇవ్వాలని పోలీసులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ ఆదేశాలతో కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్ రూ.25వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా రాజమహేంద్రవరం నుంచి అవినీతి నిరోధకశాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పటుకున్నారు. ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్‌ను అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామ న్నారు. స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇటువంటి దాడులు ఎప్పుడూ జరగలేదు. రక్షించాల్సిన పోలీసులే ఈవిధంగా లంచాలు డిమాండ్ చేస్తుంటే సామాన్య ప్రజలు సరైన న్యాయంకోసం ఎవ్వర్నీ ఆశ్రయించాలని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఆనందంగా వెళ్లి.. నిర్జీవులుగా..

- ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు
- 'ఇద్దరు విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు'
- 12 గంటలకు తండ్రికి చివర్ కాల్



విద్యార్థులు గల్లంతైన సీతపల్లి వాగు

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి)/రంపచోడవరం : అల్లూరి జిల్లాలోని రంపచోడవరంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగులో ఇద్దరు విద్యార్థులను మింగేసి ంది. ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమ హేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మొదటి ఏడాది ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం(8)తో పూర్తయ్యాయి. 11వ తేదీ నుంచి సెలవులు. దీంతో 10మంది విద్యార్థులు ప్లెజర్ ట్రిప్ ప్లాన్ చేసుకున్నారు. కాలేజీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతుండడంతో ఐదుగురు విద్యార్థులు ఆగిపోయారు. మొదటి ఏడాది బీబీఏ(డిజిటల్ మార్కెటింగ్) చదువుతున్న ముగ్గురు అమ్మా యిలు, బీకాం చదువుతున్న ఇద్దరు అబ్బాయిలు ద్విచక్ర వాహ నాలపై రంపచోడవరం వైపు వెళ్లారు. సీతపల్లి వాగులో కేరింతలు కొడుతూ గడిపారు. అయితే షేక్ జబీర్(19)రాయిపై నుంచి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తూ జారి వాగులో పడిపోయాడు. అక్కడ లోతుగా ఉండడంతో కేకలు వేస్తుండగా రక్షి ద్దామని వెంటనే సుభర్షిని(19) వాగులోకి దూకింది. ఇద్దరూ ప్రవాహంలో గల్లంతయ్యారు. మిగతా ముగ్గురూ కేకలు వేయ డంతో స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రంప చోడవరం పోలీసులు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. రెండు మృతదేహాలను బయటకు తీసి రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతురాలు శుభర్షిని, మృతుడు జబ్బర్

● నాన్నకు చివరిసారిగా

రాజమహేంద్రవరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన సుభర్షిని తండ్రి బెంగళూరులో ఉద్యోగం చేస్తుండడంతో భార్యతో అక్కడే నివాసం ఉంటున్నారు. దీంతో సుభర్షిని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. జబీర్ తల్లిదండ్రులు రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. జబీర్ తండ్రి ఫ్లెక్స్ బోర్డులు చేస్తుంటారు. అతడి అన్నయ్య కూడా ఆర్ట్స్ కళాశాలలోనే చదువుకుంటున్నాడు. జబీర్ ప్రతి గంటకూ తన తండ్రికి ఫోన్ చేశాడు. కానీ మధ్యాహ్నం 12గంటల సమయం నుంచీ ఫోన్ రావడం ఆగిపోయింది. 3గంటల సమయంలో విషాద విషయం ఆయనకు తెలియడంతో రంపచోడవరం వెళ్లారు.

● నేటి కార్యక్రమాలు నిలిపివేత

ఆర్ట్స్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రిన్సిపాల్ రామచంద్రరావు నిర్వహిస్తున్నారు. బుధవా రం కైట్ ఫెస్టివల్, సంప్రదాయ వంటకాలు, సంప్రదాయ వస్త్రధా రణ తదితర కార్యక్రమాలు ఉన్నాయి. ఇద్దరు విద్యార్థుల మరణ వార్త తెలిసే సమయానికి ఆయన విజయవాడ అధికారిక సమావేశంలో ఉన్నారు. దుర్ఘటన తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బుధవారం జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేశారు. ఉదయం 11గంటలకు విద్యార్థుల సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. సభర్షిని కాలేజీకి సంబంధించిన కార్యక్రమాల్లో చాలా యాక్టివ్‌గా, సమన్వయం చేసుకుంటూ ఉండేదని.. బీబీఏ విద్యార్థులకు డ్రెస్‌కోడ్ విషయంలో కూడా పట్టుబట్టి సాధించు కుందని.. ఓ మంచి విద్యార్థిని కాలేజీ కోల్పోయిందని రామచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి 'ఆంధ్రజ్యోతి'తో ఆవేదన వ్యక్తం చేశారు.

● సీతపల్లి వాగులో..

అడవుల్లోని కాలువలను దొంగ వాగులంటారు. ఎప్పుడు ప్రవాహం వస్తుందో ఎవరూ ఊహించలేరు. పైగా ఎక్కడ లోతుగా ఉంటుందో కూడా చెప్పడం కష్టం. ఈ వాగువద్ద రద్దీ వేళల్లో కూడా సరైన రక్షణ, పోలీసుల పర్యవేక్షణ ఉండడం లేదని స్థాని కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే ఇద్దరు విద్యార్థులు బలైపోయారని మండిపడుతున్నారు.

గోదావరినదిలో కలిపేసిన ఎస్మా-2 జీవో ప్రతులు



పి.గన్నవరం వైనతేయ గోదావరి నదిలో ఎస్మా-2 జీవో ప్రతులను కలిపేస్తున్న అంగన్‌వాడీలు

పి.గన్నవరం, జనవరి 9: సమస్యలు పరిష్కరించే వరకు మేం తగ్గేదేలా... అంటూ అంగన్‌వాడీలు ఈనెల 6న ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా-2 జీవో ప్రతులను వైనతేయ గోదావరినదిలో కలిపేసి వినూత్న నిరసన తెలిపారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా 29వ రోజు మంగళవారం పి.గన్నవరం అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా గోదావరినది వద్దకు చేరుకుని సంబంధిత జీవో ప్రతులను నీటిలో కలిపేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ నాయకులు బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, జి.రాధ, ఎ.దుర్గామల్లేశ్వరి, ఆశాజ్యోతి, లలిత, కె.రాజ్యలక్ష్మి, జి.ప్రమీల, జి.అనంతలక్ష్మీదేవి పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం



డాక్టర్ యనమదల మురళీకృష్ణ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 9: సంక్రమణ వ్యాధులు, వాటి ప్రభావాలు ఇతర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ పుస్తకాలు, ఆర్టికల్స్ రాసి భరోసా నింపుతున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ఈనెల 11న ఏలూరులో జరగనున్న సాహిత్య సంక్రాంతి సంబరాల్లో డాక్టర్ మురళీకృష్ణను విశిష్ట సాహిత్య పురస్కారంతో సత్కరించనున్నట్లు అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తెలిపారు.

లాటరీ పేరుతో కుచ్చుటోపీ

- అనుమానం రాకుండా కొందరికి ఖరీదుకానీ వస్తువుల పంపకాలు
- ఒక్కొక్కరి నుంచి రూ. 3 వేల నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు
- గిరిజన పల్లెలే లక్ష్యంగా రూ. లక్షల్లో వసూళ్లు
- వారం రోజులుగా ఫోన్ల స్విచ్ఛాఫ్... లబోదిబోమంటున్న బాధితులు

ఎటపాక, జనవరి 9 : వారంతా అమాయక గిరిజనులు.... రోజూకూలీకి, వ్యవసాయ పనులకు వెళితేగానీ పూట గడవనివారు... అలాంటి అమాయక త్వాన్ని ఆసరగా చేసుకుని, కొందరు కేటుగాళ్లు లాటరీ పేరుతో బురిడీ కొట్టించారు... రూ.లక్షల్లో వసూళ్లు చేసి, చివరకు బోర్డు తిప్పేసి, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయామని, గ్రహించి గిరిజనులు లబోదిబోమంటున్నారు... ఎటపాక మండలంలో చాలా మంది బాధితులు ఉండగా, ప్రధానంగా కృష్ణవరం, భూపతిరావుపేట, కొత్తూరు, కన్నాపురం, లక్ష్మీపురం, పాలమడుగు తదితర గ్రామాల్లోని గిరి జనులు ఉన్నారు.

ఒక్కో గ్రామం నుంచి 300నుంచి 400 వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బాధితుల్లో రూ.3 నుంచి రూ.7 వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తో ంది. ఈ గిరిజన గ్రామాలో గత మూడు నెలలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక కేంద్రంగా శ్రీ హనుమాన్ ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్ లాటరీ పేరుతో కొందరు కేటుగాళ్లు ఓ బ్రౌచర్ ముద్రించి, అందులో తొలుత ప్రారంభ వారానికి రూ.20 నుంచి చివరి వారం వరకు 307 వరకు స్కీమ్ ఉన్నట్లు ప్రచారం నిర్వహించారు. ప్రతీవారం గ్రామాల్లోకి వచ్చి డబ్బులు కట్టించుకుని సంతకాలు కూడా చేశారు.. అయితే ఈ లాటరీ స్కీమ్‌పై ఎవరికీ అనుమానం రాకుండా కొందరికి తక్కువ ఖరీదైన ప్లాస్కో, కుక్క ర్లు, లైట్లు, ఇడ్లీ పాత్రలు ఇచ్చి, లాటరీ తగిలిందని నమ్మ బలికించే ప్రయత్నం చేశారు. దాంతో ఒకే కుటుంబంలో ఇద్దరి నుంచి ముగ్గురి పేరున లాటరీ కట్టారు. అయితే కొందరి వద్ద నుంచి రూ.5వేలు కట్టించుకుని ఫ్రిజ్‌లు, డబుల్‌కాట్ మంచాలు, డ్రెస్సింగ్ టేబుళ్లు ఇస్తామని నమ్మబలికించారు. చివరకు ఫోన్లు సిచ్ఛాఫ్ చేసి, ఉడాయించడంతో బాధిత గిరిజనులు లబోదిబో మంటున్నారు. దాదాపుగా ఎటపాక మండలంలో కేటు గాళ్లు రూ.20 నుంచి రూ. 30లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. సారపాకలో కూడా వారి ఆచూకీ లేనట్లు కొందరు బాధితులు పేర్కొంటున్నారు.

చదువు, ఆరోగ్యమే నిజమైన సంపద

- కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య
- మాతృభాషపై పట్టు ఉండాలి
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా శ్రీప్రకాష్ విద్యా సంస్థల వార్షికోత్సవం

పాయకరావుపేట/తునిరూరల్, జనవరి 9: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన సంపద చదువు, ఆరోగ్యమేనని కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వార్షికోత్సవ వేడుకలను 'జోష్' పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి గ్రహించాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. బాగా చదువుకుని, ఆరోగ్యం వుంటే కచ్చితంగా ఉన్నతస్థితికి చేరుకుంటారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మాతృభాషపై పట్టు వుంటేనే మిగిలిన భాషలపై పట్టు సాధించగలమని అన్నారు. జీవితంలో ఉత్తమ మార్గాన్ని ఎంచుకునే శక్తిసామర్థ్యం చదువు ద్వారానే వస్తుందన్నారు. మరో గౌరవ అతిథి బసవ తారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ, ఎటువంటి స్వార్థం లేకుండా జ్ఞానాన్ని పంచే గురువులను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. సెకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్‌డ్ మైనింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నాదెళ్ల వెంటసుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ ఎండీ వైవీఎస్.చలపతిరావు తదితరులు మాట్లాడారు. తొలుత ఏపీ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీ నారాయణ, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జాతీయస్థాయి ఆటల పోటీలు, వివిధ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా, పిరమిడ్స్, జుంబా డ్యాన్స్, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శాంతి కపోతాలను ఎగురవేస్తున్న ముఖ్యఅతిథులు, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న దృశ్యం

ఎన్ఎస్ఎస్ సాహసయాత్ర విజయవంతం

దివాన్‌చెరువు, జనవరి 9: యువజన వ్యవహారాలు క్రీడాశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ కేంద్రం పోంగ్‌డామ్‌వద్ద నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సాహసయాత్రను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ యాత్రకు హాజరైన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. గతనెల 19 నుంచి 28 వరకూ ఈయాత్ర సాగిందన్నారు. దీనికి నన్నయ వర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఒక పీవో హాజరయ్యారన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.రాజశేఖర్, కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ నుంచి ఐ.ఆనందబాబు, నన్నయ క్యాంపస్ నుంచి ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం నుంచి జి.ఆది, భీమవరం బీవీ రాజు కాలేజ్ ఆఫ్ సైన్స్ నుంచి పి.దుర్గాగణేష్, గైట్ కళాశాల నుంచి సీహెచ్ చరిష్మా, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి పి.సాయిరత్నం, కిర్లంపూడి ఎస్వీవీఎస్ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.ఉష, రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి కె.హర్షిణి, పాలకొల్లు డీఎస్ఆర్ మహిళా కళాశాల నుంచి ఎస్.లక్ష్మీదేవి పాల్గొన్నారన్నారు. మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా తమ సాహసయాత్రను కొనసాగించారని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వైశ్రీనివాసరావు వలంటీర్లకు, పీవోకు అభినందనలు తెలిపారు.

104 విభాగంలో ఉద్యోగాల భర్తీ

జీజీహెచ్ (కాకినాడ) జనవరి 9 వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా సేవలు అందిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్లలో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నుంచి మంగళవారం ప్రకటన వెలువడింది. ఇందులో 20 డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈవో), 20 డ్రైవర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో డా. నరసింహనాయక్ తెలిపారు. అభ్యర్థులు ఎదైనా డిగ్రీ పూర్తి చేసిన కంప్యూటర్, టైపింగ్‌లో అనుభవం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు డీఈవో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే 10వ తరగతి పూర్తి చేసి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉన్న పురుష అభ్యర్థులు డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ రెండు ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితి 35 ఏళ్లుగా నిర్ణయించారు. అర్హత కలిగి ఆశక్తి ఉన్న అభ్యర్థులు వారి బయోడేటాకు విద్య అర్హతతోపాటు లైసెన్స్ పత్రాలను దరఖాస్తుకు జతచేసి ఈనెల 10, 11 తేదీలలో కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న 104, 108 కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సెలవుల్లో పనికి వెళ్లి యువకుడి మృత్యువాత



మృతి చెందిన కోడి సంగీత్‌కుమార్

దేవరపల్లి, జనవరి 9: చదువుకుంటూ సెలవు రోజులు కావడంతో కూలిప నికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన ఏడుగురు యువకులు స్నేహితులు. వేర్వేరు చోట్ల చదువుకుంటున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో పనిలోకి వెళ్దామనుకున్నారు. మంగళవారం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ట్రాక్టర్‌లో కొబ్బరాకులు లోడు చేసుకుని మధ్యాహ్నం తిరిగి కలవలపల్లి బయలుదేరారు. ట్రాక్టర్ లోడుపై నలుగురు, ట్రాక్టర్ ఇంజన్ మధ్యలో ఉన్న రాబర్ పైన ముగ్గురు నిలుచున్నారు. త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు గోతులమ యంగా ఉంది. ఎదురుగా వస్తున్న చెరుకు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రాబర్‌పై కూర్చున్న వారిలో కోడి సంగీత్‌కుమార్(19) ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ అతని పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సంగీత్‌కుమార్ నిడదవోలులో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి కూలి పనికి వెళ్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సంఘటన ప్రాం తాన్ని ట్రైనీ డీఎస్పీ భానోదయ పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకు న్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'కొత్త పింఛను విధానం రద్దు చేయాలి'

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛను విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఎంప్లాయీస్ సంఘ్ పిలుపుమేరకు రైల్వే ఉద్యోగులు రైల్వేస్టేషను ఆవరణలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు వెంటనే నిర్ణయం ప్రకటించాలని నినాదాలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య, విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వ రరావు దిశా నిర్దేశంతో పోరాటం సాగిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో కూడా నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమంలో వి.త్రినాథ్, ఎస్ఎస్ చంద్రమౌళి, జేడీ ప్రసాద్, టి.నాగేంద్రరావు, అరవ నాగేంద్రకుమార్, డి.రమేశ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం



పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించిన వివిధ సంఘాల నాయకులు

ఎస్మా చట్టం రద్దు చేయాలి

● కార్మిక ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలి

రంపచోడవరం, జనవరి 9: సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీ యూ అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు, వెలుగు యానిమేటర్లు, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు మద్దతుగా మంగళవారం జైలు బరో ర్యాలీ నిర్వ హించి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ అంగ్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోగా వారిపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్మికులపై గతంలో ఇటువంటి జీవోలు అమలు చేసిన ప్రభుత్వాలు అధికారంలో లేకుండా పోయాయన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు మాట్లాడుతూ కార్మికులపై నిర్బంధాలు ప్రయోగిస్తే భయపడే పరిస్థితి లేదన్నారు. కార్మికులపక్షాన గిరిజన సంఘాలన్ని ఏకంచేసి మద్దతుగా ఉద్యమి స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల, జిల్లా నాయకురాలు కె.రాణి, ఆశా యూనియన్ నాయకులు కలింకోట రమణమ్మ, కొమరం చెల్లాయమ్మ, మార్త మంగాయమ్మ, ఏఐకేఎంఎస్ జిల్లా ఉ పాధ్యక్షుడు ఐ.వి.రమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శాంతిరాజు, జిల్లా అధ్య క్షుడు ఈతలపల్లి సిరిమల్లిరెడ్డి, మండలాధ్యక్షుడు ఎస్.విద్యాసాగర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంగన్‌వాడీల బైఠాయింపు



రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రాజవొమ్మంగి, జనవరి 9: రాజవొమ్మంగిలో అంగన్‌వాడీలు మంగళవారం ఎరుపు రంగు దుస్తులతో నిరసన తెలిపారు. రాజవొమ్మంగి గ్రామంలో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహి ంచారు. అల్లూరి జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ప్రధానరహదారిపై రాస్తారోకో నిర్వహించి, బైఠాయించారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతుందంటూ పోలీసులు అంగన్‌వాడీ వర్కర్లను అరెస్టు చేసి పోలీసుస్టేషన్ కు తరలించారు. అంగన్‌వాడీ వర్కర్లు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతూ బైఠాయించారు. వ్యక్తిగత పూచికత్తులతో అంగన్‌వాడీలను పోలీసులు వదిలిపెట్టారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, సీఐటీయూ నాయకులు పి.రామరాజు అంగన్‌వాడీలు నిరసనలో పాల్గొన్నారు. చికిలింత సర్పంచ్ సూరిబాబు, కొండపల్లి సర్పంచ్ జగన్నాధం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అరెస్టుపై ఖండన



ఉపాధ్యాయులను నిర్బంధించిన దృశ్యం

రంపచోడవరం, జనవరి 9: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.18వేల కోట్ల బకాయిలు చెల్లించాలని కోరుతూ ప్రజాస్వామిక పద్ధతిలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్టు చేయడాన్ని అల్లూరి సీతా రామరాజు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి కె.ఆది రెడ్డి ఖండించారు. జనవరి 9, 10 తేదీలలో చేపట్టే 36 గంటల దీక్షకు గత 15రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వ ఉన్న తాధికారులు, మంత్రులకు మోమోరాండం అందజేశారు. దీనిపై ప్రభుత్వం చర్చలకు పిలవకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను నిర్బంధించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూ టీఎఫ్ మండలాధ్యక్షుడు సీహెచ్‌ఆర్ సనాతనబాబు, మండల గౌరవాధ్యక్షుడు డి.టాల్ స్టాయ్‌బాబు, కోశాధికారి డి.పి.లింగన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సూ రిబాబు పాల్గొన్నారు.

తాగునీరు కోసం బిందెలతో నిరసన

● పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, జనవరి 9: జాతీయ రహదారి నిర్మాణంతో తమ గ్రామనికి తీరని నష్టం జరిగిందంటూ వట్టిగెడ గ్రామస్థులు మంగళవారం జాతీయరహదారిపై ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. తంటికొండ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, అవుగడ్డ నిర్మలదేవి ఆధ్వర్యంలో గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వట్టిగెడ గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ తొలగించారని, మరలా తిరిగి పైప్‌లైన్ వేయకపోవడంతో తమ గ్రామానికి మంచినీటి సౌకర్యం లేక ఐదు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి తెలిపారు. సుమారు గంటన్నరపాటు రోడ్డుపై గ్రామస్థులు బైఠాయించడంతో వాహనరాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు మా ట్లాడుతూ ఇప్పటికే జాతీయరహదారి నిర్మాణ సిబ్బందికి మంచినీటి సమస్య తెలియజేస్తే ఒక వాటర్ ట్యాంకర్ పంపుతున్నారని, ఆ వాటర్ ట్యాంకర్ నీళ్లు ఎవరికి చాలట్లేదన్నారు. పండగ పూట ఇంటికి వచ్చే అతిథులకు మంచినీరు ఇవ్వలేని పరిస్థితి లో ఉన్నామంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయరహదారి నిర్మాణ అధికారులు,ప్రభుత్వ అధికారులు గ్రామస్థులకు మంచినీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

పింఛను కష్టాలు

● మూర్ఛవ్యాధితో పడిపోయిన గిరిజనుడు ● ఆసుపత్రికి తరలింపు



పడిపోయిన వృద్ధుడు

కూనవరం, జనవరి 9: పింఛను పంపిణీ కార్యక్రమం ఆలస్యకావడంతో ఆసభకు వచ్చిన వృద్ధుడు వెంకయ్య మూర్ఛవ్యాధితో స్పృహతప్పి కిందపడిపోయాడు. 57సంవత్సరాలు కల్గిన వృద్ధుడు వెంకయ్య మండలంలోని జిన్నెలగూడెం గ్రామం నుంచి వచ్చాడు. ప్రభుత్వం నిర్వహించిన పింఛను పంపిణీ కార్యక్రమం కూనవరం పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమం వాస్తవానికి మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కావలసి ఉంది. కానీ ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి సాయంత్రం 5.30వరకు రాకపోవడంతో పింఛను కార్యక్రమానికి వచ్చిన వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఇంతలోనే ఈ కార్యక్రమానికి వచ్చిన వెంకయ్యకు మూర్ఛవ్యాధి వచ్చింది. సభలోనే వెంకయ్య విలవిల్లాడుతూ కొట్టుకున్నాడు. దీంతో వెంకయ్యను 108వాహనం ద్వారా కోతులగుట్టలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. సభ సాయంత్రం 7గంటల వరకు జరగడంతో వృద్ధులు చలికి ఒణికిపోయారు. ప్రభుత్వంవద్ద డబ్బులులేక వృద్ధులతో ఆటలు ఆడుకుంటుందని టీడీపీ మహిళా నాయకురాలు మాజీ జడ్పీటీసీ యడవల్లి కన్య కాపరమేశ్వరి అన్నారు. రాత్రివరకు వృద్ధులను సభలో ఉంచడం ఎంతవరకు శ్రేయస్కరం అని ప్రశ్నించారు. అసలే వృద్ధులు కావడంవలన కళ్లు కనపడక, చలికి వణుకుతూ వారు ఇంటికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇటువంటి చర్యలు మానుకోవాలన్నారు.

పింఛన్ల పెంపు టీడీపీ హయాంలోనే జరిగింది

ఎటపాక, జనవరి 9: పేదవారికి పింఛన్ల పెంపు టీడీపీ హయాంలోనే జరిగిందని, టీడీపీపై ఎమ్మెల్సీ అనంతబాబు తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎటపాక టీడీపీ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్ అన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ గారడిచేసి పాలన సాగించిందన్నారు. ఐదేళ్లలో కేవలం వైసీపీ 1000 రూపాయలే పెంచిందన్నారు. పింఛన్‌ను 5 రెట్లు పెంచిన ఘనత టీడీపీదేనన్నారు.

కొంకుదురులో టీడీపీ 'మహాశక్తి'

బిక్కవోలు, జనవరి 9: కొంకుదురులో మంగళవారం తెలుగు మహిళలు మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి మరలా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బేరా వేణమ్మ, జుత్తుగ సూర్యకుమారి, సుభాషిణి, సత్య గౌరి, మల్లీశ్వరి, సత్యవతి, మండలాధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే ఎస్మా ప్రయోగిస్తారా ?

▸▸ అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా

▸▸ రాజమహేంద్రవరంలో రాస్తారోకో, నిరసన ప్రదర్శన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : వేతనాలు పెంచమని ఆందోళన చేస్తున్న అంగన్వాడీ వర్కర్లపై ఎస్మా ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కోటిపల్లి బస్టాండు సెంటర్‌లో రాస్తారోకో చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించి సమ్మె విరమింపచేయాలని నినాదాలు చేశారు. దీన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారులు ప్రతిఘటిస్తూ నిరసన కార్యక్రమం కొనసాగించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె. రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కె.జోజి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని కోరుతూ రాష్ట్రంలో రెండు లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు సమ్మెలు చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నీరో చక్రవర్తిలా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్నారన్నారు. తక్షణం అంగన్వాడీలను ఎస్మా పరిధి నుంచి తొలగించాలని, మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సమగ్రశిక్ష ఉద్యోగులకు సుప్రీం కోర్టు తీర్పుప్రకారం సమాన పనికి సమాన వేతనం, మినిమం టైం స్కేల్, రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే గతంలో ఎస్మా ప్రయోగించిన ముఖ్యమంత్రులకు పట్టిన గతే జగన్‌కు పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నామణి, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు నల్లా రామారావు, జట్టు లేబర్‌యూనియన్, కార్మిక సంఘాల నాయకులు, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పొర్లు దండాలు

రాజానగరం, జనవరి 9: న్యాయపరమైన తమ డిమాండ్ల సాధన కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో మంగళవారం నాటి దీక్షలో అంగన్‌వాడీలంతా కటిక నేలపై బోర్లా పడుకుని పొర్లు దండాలతో ప్రణమిల్లారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ చేతులు జోడించి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లాధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ ఎం.మార్తమ్మ, సెక్టారు లీడర్లు పి.సుబ్బలక్ష్మి, సత్యనారాయణ్మ, గంగ, మాధురి తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



కోటిపల్లి బస్టాండు నుంచి శ్యామలాసెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేదు..

▸▸ నగర ఎస్సీసెల్ ప్రమాణస్వీకారంలో టీడీపీ నేతలు



ప్రమాణస్వీకారం చేస్తున్న నగర టీడీపీ ఎస్సీఎల్ నూతన కమిటీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: భారత దేశంలో ఏ రాష్ట్రంలోను జరగని విచిత్రమైన సంఘటనలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయని దళితుల పైన ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కేసులు పెట్టించిన ఏకైక సీఎం జగన్ అని టీడీపీ నేతలు అన్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన టీడీపీ ఎస్సీసెల్ నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడారు. దళితులకు ద్రోహం చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులకు రక్షణ లేదన్నారు. చంద్రబాబు దళితుల సంక్షేమం చూస్తే జగన్ కేవలం ఓటు బ్యాంకుగా వినియోగించుకున్నాడన్నారు.దళితుల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా చాపల చిన్నరాజు, ప్రధాన కార్యదర్శిగా మామిడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఉడమల నాగేశ్వరరావు, బూరా రమణ, చెదలవాడ ప్రభాకర్, రాచర్ల వెంకటరమణ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, వర్రే శ్రీనివాసరావు, నక్కాచిట్టిబాబు, రాచపల్లి ప్రసాద్, ఈతలపాటి కృష్ణ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

దివాన్‌చెరువు, జనవరి 9: సంక్రాంతి ముందస్తు సంబరాలను పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. దివాన్‌చెరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో భోగిమంటలు, బొమ్మల కొలువులు, పాలపొంగళ్లు, దూడూబసవన్నల సందళ్లు, సంప్రదాయ నృత్యరూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఆధునికకాలంలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలను నేటితరానికి తెలియజేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు చలుమూరు శ్రీనివాస రావు, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని ఆదర్శ పార్మశీ కళాశాలలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భోగిమంటలు, గొబ్బెమ్మలు, పాలకడవులు, గుడిసెలు, ఎడ్ల బండ్లు, కోడి పందేలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు ఆటల పోటీ ల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ అవార్డు గ్రహీత నాగమణి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రగళ్ళపాటి కనకరాజు, సెక్రటరీ నాగమణి, కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ప్రిన్సి పాల్ త్రినాధరావు, సుజిని, కామేష్, ప్రమ్‌కుమార్, సంకీర్తన పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు ఎల్.సీతారత్నం ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు రంగవల్లుల మధ్య హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల అలంకరణ, కోడిపందేలు, బుడబుక్కవారి వేషధారణలతో భోగిమంటలు వేసి పాటలతో విద్యార్థులు డ్యాన్సుల మధ్య పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. గ్రామంలోని వృద్ధ మహిళలకు సోషల్ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ చీరలు పంపిణీ చేశారు. పాఠశాల వాచ్‌మెన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సూరిబాబు, మోహన్ భగవాన్, సుధాకర్, ఝాన్సీ, చక్రం, రమ్య, ఉపాధ్యేతర సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: వెదుళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

బిక్కవోలు: మెళ్లూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల హరిదాసు వేషధారణలు, సంప్రదాయ దుస్తుల ధారణ, రంగవల్లులు, గొబ్బెమ్మలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో విజేతలకు సర్పంచ్ సాయిరాం, ఉపసర్పంచ్ ఆనంద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పసుపు జిగురు అట్టలతో తెల్లదోమ నివారణ

▸▸ ఉద్యాన విస్తరణాధికారి అరవింద్‌సాయి

రంగంపేట, జనవరి 9: తెల్లదోమ తల్లి పురుగులను నివారించడానికి పసుపు జిగురు అట్టలను చెట్టు చుట్టూ పెట్టాలని ఉద్యాన విస్తరణాధికారి ఆర్.అరవింద్‌సాయి అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో పతంజలి ఫుడ్స్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 12-14 నెలల వయసున్న మొక్కలు నాటాలన్నారు. ఆయిల్‌పామ్‌లో తెగుళ్లు, చీడపీడల నివారణ చర్యలను పతంజలి జూనియర్ మేనేజర్ టి.ఓంకార్ వివరించారు. కార్యక్రమంలో రంగంపేట క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎన్‌వీడీ ప్రసాద్, భగవాన్, గ్రామ రైతులు, పతంజలి ఫుడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరిస్తున్న పామాయిల్ సాగు

బిక్కవోలు, జనవరి 9: పామాయిల్ తోటల సాగు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట గ్రామాల్లో వేగంగా విస్తరిస్తోందని పతంజలి పామాయిల్ కంపెనీ డీజీఎం రవీంద్ర అన్నారు. ఇళ్లపల్లిలో మంగళవారం జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ మెట్టలో ఇతర పంటలతో పోలిస్తే ఈ పంట ఆదాయం ఎక్కువన్నారు. అభ్యుదయ రైతులు పుట్టా సోమన్నచౌదరి, వత్సవాయి సుబ్బరాజు మాట్లాడుతూ గతంలో పామాయిల్ గెలలు టన్ను రూ.23 వేలు ఉండగా ప్రస్తుతం రూ.12 వేలకు పడిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన అన్న రకాల సబ్సిడీలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ విస్తరణాధికారి అరవింద్, పంతంజలి ప్రతినిధులు ఓంకార్‌శ్రీనివాస్, రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ మీటర్లతో రైతులకు ఇబ్బందులు

విద్యుత్‌శాఖ డీఈకి నర్సరీసంఘం వినతి

కడియం, జనవరి 9: కడియం నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో నర్సరీ సంఘం మంగళవారం విద్యుత్‌శాఖ డీఈ శ్రీధర్‌వర్మను కలిసారు. పొట్టిలంక తదితర గ్రామాల్లో నర్సరీలకు ఇచ్చే అగ్రికల్చర్ త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు వేస్తున్నట్టు రైతులు నర్సరీసంఘం దృష్టికి తీసుకొచ్చారన్నారు. నర్సరీ రైతులకు గతంలో ఉచిత విద్యుత్ ఇస్తూ జీవో ఇచ్చారని, ఇప్పుడు మీటర్లు వేయడంపై రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మీటర్లు వేయడం ఆపాలని విద్యుత్‌శాఖ డీఈకి వినతి పత్రం అందజేసినట్టు నర్సరీ సంఘం తెలిపింది. కార్యక్రమంలో నర్సరీ సంఘం సెక్రటరీ గాద నాగేశ్వరరావు, జంగా సుబ్బారావు, గరగ నాగేశ్వర రావు, గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరరావు ఉన్నారు. అలాగే జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.సుజాతను కలిసి నర్సరీ సంఘం వినతిపత్రం అందజేశారు. నర్సరీలకు గతంలో రాయితీపై ఆర్‌కెవీవై పథకంలో 2021-22లో మంజూరైన పాలీహౌస్‌ల పెండింగ్ బిల్లులు రైతులకు అందించాలని, రాయితీపై నర్సరీ ఉపకరణాలు అందించాలని వినతిపత్రం అందించారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న తోట నరసింహం

గోకవరం, జనవరి 9: వైసీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం మంగళవారం గోకవరంలో పర్యటించారు. ముందుగా దేవిచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వ్యాపారవేత్త అక్షింతల రాజా ఇంటికి వెళ్లారు. తదుపరి దాసరి రమేష్, వరసాల ప్రసాద్‌లను పరామర్శించారు. ఆయన వెంట గుల్లా ఏడుకొండలు, పాటి రాంబాబు, దాసరి చినబాబు, సుంకర రమణ, తోలేటి రామప్రసాద్ ఉన్నారు.

పోలవరం నిర్వాసితుల నిరసన దీక్ష

గోకవరం, జనవరి 9: సమస్యల పరిష్కారం కోరుతూ గోకవరం గ్రామ శివారున పోలవరం నిర్వాసితులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం 27వ రోజుకు చేరుకొంది. మాట తప్పను, మడమ తిప్పను అని గత ఎన్నికలకు ముందు వాగ్దానాలు ఇచ్చి, సీఎం పీఠంపై కూర్చున్నాక తమ ఊసే ఎత్తని జగన్ రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం తమ ఊరు, గూడు వదులకొని వస్తే తమ పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేసే వరకు దీక్షలు కొనసాగుతాయని నిర్వాసితులు చెప్పారు.

సారా కేసులో ఒకరి అరెస్ట్

రంగంపేట, జనవరి 9: సుభద్రంపేటలో ఎస్ఈబీ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి సారా విక్రయిస్తున్న సూరంపూడి గొల్లబాబును అరెస్టు చేసి, అతడి 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరం తరలిన దళిత నాయకులు

కడియం, జనవరి 9: ధవళేశ్వరంలో జరిగిన రూరల్ నియోజకవర్గ దళిత సమావేశానికి మండలంలోని జేగురుపాడు నుంచి స్టాలిన్ యువసేన మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. జేగురుపాడు నుంచి కడియపుసావరం, కడియం, వేమగిరి గ్రామాల మీదుగా ర్యాలీ ధవళేశ్వరం చేరుకుంది.

ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి సొంతూర్లకు వచ్చే ప్రజల కోసం జిల్లా ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు ప్రారంభించింది. తొలిదశలో ప్రధానంగా హైదరాబాద్‌కు ఈ సర్వీసులు నడుపుతున్నారు. మంగళవారం రాత్రి రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి ఏడు స్పెషల్ బస్సులను హైదరాబాద్‌కు పంపించారు. ఇవి ఉదయానికి హైదరాబాద్ చేరుకుని బుధవారం సాయంత్రం/రాత్రి అక్కడి నుంచి ప్రయాణీకులతో తిరిగి బయలుదేరి గురువారం ఉదయానికి జిల్లాకు చేరుకుంటాయి. అలాగే, ప్రతిరోజూ నడిచే షెడ్యూల్ బస్సులు మరో ఏడు కూడా హైదరాబాద్ వెళ్లాయి. దీంతో మొత్తం 14 బస్సులను పంపించారు. ఈ బస్సులన్నీ డౌన్‌లో అంటే హైదరాబాద్ నుంచి రద్దీగానే వస్తాయని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. బుధ, గురువారాల్లోనూ స్పెషల్ సర్వీసులు హైదరాబాద్‌కు నడుపుతామని స్పష్టం చేశారు.

రామాలయం నిర్మాణానికి భవాని ట్రస్ట్ సహకారం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: రాజమహేంద్రవరం 3వ డివిజన్‌లోని చేపట్టిన రామాలయం నిర్మాణ పనులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భవానీ చారిటబుల్ ట్రస్ట్‌నిర్వాహకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుడుపూడి సత్తిబాబు, బొమ్మనమైన శ్రీనివాస్, అహ్మదున్నీషా బేగం, కంటిపూడి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు ఒక స్టాండ్ లేదు

పేపరుమిల్లు కార్మిక నేత చిట్టూరి ప్రవీణ్‌చౌదరి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఒక స్టాండ్ లేదని పేపరు మిల్లు కార్మిక సంఘం నాయకుడు చిట్టూరి ప్రవీణ్ చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం పేపరుమిల్లు సమీపంలోని వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ పేపరుమిల్లు కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పవన్ వల్ల జగన్ ప్రభుత్వానికి జరిగే నష్టం ఏమీలేదన్నారు. సమావేశంలో కె.యశ్వంత్ కుమార్, పెనుమాక సునీల్ కుమార్, కె సింహాద్రి , వెంకన్న, ఎం.వెంకటనాథ్, ఎస్.శివ , యు.ధనరాజ్, ఐ దుర్గాప్రసాద్, జి.జగదీష్, బి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు రైల్వే ట్రాక్‌పై చేరకుండా చూడండి

మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: రాజమహేంద్రవరం గోదావరి రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రాంతాలైన అన్నపూర్ణమ్మపేట, కోటగుమ్మంలను కమిషనర్ దినేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో మురుగునీరు చెత్త రైల్వే ట్రాక్ పైకి చేరుకుండా చూడాలని పారిశుధ్యవిభాగం అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, రైల్వే అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ముగురునీరు డ్రైనేజీ వాటర్ రైల్వే ట్రాక్ పైకి రావడం వల్ల రైలులో ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆయన వెంట కార్పొరేషన్ ఎస్ఈ పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్‌మూర్తి తదితరులు ఉన్నారు.

గోదావరి ఉత్సవాల నిర్వహణకు స్థల పరిశీలన

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవు, దాని సమీపంలోని రైల్వే స్థలంలో గోదావరి ఉత్సవాలు 2024 నిర్వహిస్తామని కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. పుష్కరఘాట్ నుంచి రైల్వే స్థలం వరకు పరిశీలించారు. రైల్వేశాఖ వారిని ఆ స్థలాన్ని కొంతకాలం నగరపాలక సంస్థకు అప్పగించాలని కోరామని కమిషనర్ చెప్పారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కసరత్తు : జేసీ

రాజమహేంద్రవరం, జనవరి9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అందిన జర్నలిస్టుల అర్హుల జాబితాను పరిగణనలోకి తీసుకుని ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నట్టు జేసీ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు.కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో మంగళవారం ఇళ్ల స్థలాల గుర్తింపు అంశంపై పాత్రికేయుల కమిటీ సభ్యులతో సమావేశమ య్యారు. స్థలాలను పరిశీలిం ,కమిటీ అభిప్రాయాలు తీసుకుని సాధ్యమైన తొందరగా స్థలాలు ఇవ్వడానికి కలెక్టర్ మాధవీలత ఇప్పటికే ఆదేశాలిచ్చారన్నారు.

బాల్ బాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బిక్కవోలు, జనవరి 9: తాడేపల్లిగూడెం పెంటపాడు డిగ్రీ కళాశాలలో సోమవారం ముగిసిన ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో బిక్కవోలు శ్రీప్రజ్ఞా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని కరస్పాండెంట్ ఓదూరి శ్రీను మంగళవారం తెలిపారు. తమ కళాశాల జట్టులోని సీహెచ్.రాజు, బి.స్వామి, ఎస్.సంతోష్‌లు ప్రతిభ కనబరిచి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఫిబ్రవరి నెలలో బెంగళూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఏవీ కృష్ణారెడ్డి, ఇంటర్ ప్రిన్సిపాల్ ఎన్.గోవిందరాజు, ఇతర అధ్యాపకులు అభినందించింది.

నేడు మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

రాజానగరం, జనవరి 9: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఈ నెల 10న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో ఎం.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. సచివాలయ పరిధిలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని, 20వ తేదీ వరకు ఈపోటీలు జరుగుతాయని చెప్పారు. ఆటల పోటీలు నిర్వహించు జట్ల వివరాలు, ఆడాల్సిన తేదీలు, సమయం తదితర వివరాలను ఆయా గ్రామ సచివాలయాలకు పంపించామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ప్రభుత్వం సరఫరా చేసిన టీ షర్టులు, క్యాప్‌లు ధరించి పోటీలకు హాజరు కావాలన్నారు.

13న రాజానగరంలో ముగ్గుల పోటీలు

రాజానగరం, జనవరి 8: సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13న నియోజకవర్గంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు బంగారాన్ని బహుమతిగా అందజేస్తామన్నారు. రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఆ రోజు మధ్యాహ్నం ఒంట నుంచి సాయంత్రం 5గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు, యువతులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు గళ్లా సత్యశ్రీ 93813 72373(రాజానగరం), యర్రంశెట్టి దేవి శ్రీనివాస్ 93461 91887(దివాన్‌చెరువు), సత్య 90320 21116(సీతానగరం), బదిరెడ్డి తులసిదొర 97057 54954(కోరుకొండ) నెంబర్లలో సంప్రదించాలని బలరామకృష్ణ తెలిపారు.

కన్నుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం



బిక్కవోలు, జనవరి 9: బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన, విశేష ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను కల్ప వృక్ష వాహనంపై వుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారి వాహనాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. అనంతరం ప్రత్యేక ఉత్సవం, ఆయనోత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోడానికి వచ్చిన భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న భరతనాట్య, కూచిపూడి ప్రదర్శనలు

అనపర్తి, జనవరి 9: అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీశారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి బెంగుళూరుకు చెందిన శివప్రియ నృత్య పాఠశాల బృందం ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాట్య మయూర డాక్టర్ సంజయ్ శాంతారామ్ శిష్య బృందం 25 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పారిశ్రామికవేత్త తేతల ఉపేంద్రరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో వీవీఆర్ సుబ్రహ్మణ్యం, మారెళ్ల గంగరాజుశర్మ, మేడపాటి చెల్లారెడ్డి, పత్తేటి శ్రీనివాసరావు(టీటీడీ), సమితి ప్రతినిధులు తమలంపూడి చినఆదిరెడ్డి, ఎస్ఎంఎం బాలకృష్ణారెడ్డి, రెడ్డి సతీష్, కర్రి చంటిబాబు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	:	డెవిల్
సూర్యామినీ	:	ఆక్వామేన్
సూర్యాప్యాలస్	:	యానిమల్
స్వామి	:	హాయ్ నాన్న
శివజ్యోతి	:	మాయాబజార్
అనుశ్రీ(సాయికృష్ణ)	:	డెవిల్
రాజా	:	సలార్
అశోక	:	సలార్
ఊర్వశి	:	డెవిల్
రంభ	:	బబుల్‌గమ్
మేనక	:	ఆక్వామేన్
అప్సర	:	కపాలదీవి
వీఎస్ మహల్ (నామవరం)	:	సలార్, డెవిల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	:	డెవిల్
వెంకటసూర్య(కడియం)	:	సలార్,డెవిల్
సత్యగౌరి (అనపర్తి)	:	సలార్
సూర్యశ్రీ (అనపర్తి)	:	డెవిల్
ఫార్ట్యూన్ సినిమాస్(రాజానగరం)	:	డెవిల్
రామకృష్ణ(కోరుకొండ)	:	డెవిల్
గీతాసినిమాస్ (సీతానగరం)	:	హాయ్ నాన్న
శ్రీనివాస (గోకవరం)	:	డెవిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	:	సలార్
లలితామహల్(రంపచోడవరం)	:	డెవిల్
నవయుగ(చింతూరు)	:	డెవిల్

చెత్త వాహనాలకు బ్రేకులు పడ్డాయ్..



కొవ్వూరులో నిలిపివేసిన చెత్త వాహనం

ఏం ప్రభుత్వమో ఏంటో.. సమస్యలు పరిష్కరించమన్నా స్పందించడంలేదు.. ఇచ్చిన హామీలు నెరవేర్చమన్నా పట్టించుకోవడంలేదు..గతంలో మునిసిపల్ కార్మికుల సమ్మె అంటే సర్కారు ముందుగానే దిగొచ్చేది.. వద్దు బాబూ మీ సమస్యలేంటో చెప్పండి.. మేం తీరుస్తాం అంటూ బుజ్జగించే వారు.. విధుల్లోకి రప్పించేవారు.. మరి నేడు.. అసలు సర్కారు పట్టించుకోవడమే లేదు.. ఏం చేసుకుంటారో చేస్కోండి.. మేం స్పందించేది లేదంటూ భీష్మించుకుని కూర్చుంటుంది..ఒక పక్కన మునిసిపాలిటీల్లో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోతూనే ఉంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతూనే ఉంది.. దోమలు విజృంభిస్తూనే ఉన్నాయి.. కంపు భరించలేం అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయినా సర్కారు మాత్రం దిగిరావ డంలేదు. ఎవరేమైతే మాకేంటి అనే ధోరణిలో ఉంది పరిస్థితి..

ఎక్కడ చెత్త అక్కడే!



కొవ్వూరులో రోడ్డుపై చెత్త కుప్ప

సీఎం గారూ..

ఇదేనా చె(చి)త్తశుద్ధి

జిల్లా వ్యాప్తంగా పట్టణాలు కంపు కొడుతున్నాయి.. ఏ రోడ్డు చూసినా చెత్తతో దర్శనమిస్తోంది. జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు ఉన్నాయి. కొవ్వూరులో గత నెల 27వ తేదీ నుంచి కార్మికులు సమ్మెలోకి దిగారు. దీంతో వీధులన్నీ ఎక్కడికక్కడ చెత్తతో దర్శనమిస్తున్నాయి. ఇక రాజమహేంద్రవరం కార్పొరేషన్, నిడదవోలు మునిసిపాలిటీలో ఈ నెల 3వ తేదీ నుంచి సమ్మె బాటపట్టారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. అయితే ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు విధుల్లో ఉంటే ఔట్ సోర్సింగ్ కార్మికులు మాత్రం ఆందోళనలో ఉన్నారు. మూడు పట్టణాల్లో మొత్తంగా 973 మంది సమ్మె చేస్తున్నారు. కేవలం 406 మం ది పర్మినెంట్ ఉద్యోగులు మాత్రమే పనులు చేస్తున్నారు. పారి శుధ్య పనులు చేయలేక అష్టకష్టాలు పడుతున్నారు.చాలా చోట్ల మేం చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు.ఇదిలా ఉండగా రెగ్యు లర్ ఉద్యోగుల పనులను అడ్డుకుంటే కానీ ప్రభుత్వం దిగిరాదనే యోచనలో ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు

- 973 మంది కార్మికుల సమ్మెబాట
- అధ్వానంగా తయారైన పట్టణాలు
- చెత్తచెత్తగా మారుతున్న వీధులు
- జిల్లాలో మూడు పట్టణాల్లో ఇదీ తీరు
- విధుల్లో 406 మంది కార్మికులు
- పనులు చేయలేక అవస్థ
- ప్రభుత్వంతో ఫలించని చర్చలు
- కొవ్వూరులో 15 రోజులుగా..
- రాజమహేంద్రవరం, నిడదవోలులో 7 రోజులుగా ఆందోళన



నగరం కంపు కొడుతోంది..!

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 : నగరంలో ఎటు చూసినా చెత్త.. ఎక్కడ చూసినా చెత్త.. ఏడు రోజుల కిందటి వరకూ క్లీన్‌గా ఉంటే నగరం నేడు చెత్త చెత్తగా మారింది.అయినా పట్టించుకున్నవారు లేరు.. చెత్త సమస్యను పరిష్క రించిన వారూ లేరు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు గత 7 రోజులుగా సమ్మె బాటపట్టారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఈ నెల 3 నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. నగరంలో 20సర్కిల్స్ పరిధిలో 20 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. 50 మంది మేస్త్రీలు ఉన్నారు. వారిలో 19 మంది ఔట్‌సోర్సింగ్ మేస్త్రీలు ఉన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో సుమారు 340 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు ఉన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో సొసైటి ద్వారా విధులు నిర్వహిస్తున్న 742 మంది పారిశుధ్య కార్మికులు, 42 మంది డ్రైవర్లు సమ్మె చేస్తున్నారు. నగరంలో ఒక్కసారిగా 784 మంది తాత్కాలిక కార్మికులు విధులు నిలుపుదల చేసి సమ్మెలోకి వెళ్లడంతో కథ అడ్డం తిరిగింది. జగన్ పాదయాత్రలో ఉండగా 2006కు పూర్వం నుంచి విధుల్లో ఉన్న కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో కార్మికులు రోడ్డెక్కారు. 742 మంది చేయాల్సిన పనిని 340 మంది పర్మినెంట్ కార్మికులు పనులు చేయలేక అవస్థలు పడుతున్నారు. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు పనులు చేయకుండా ఔట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకుంటే నగరం కంపుకొట్టడం ఖాయం.

నిడదవోలులో అధ్వానం



నిడదవోలు మెయిన్‌రోడ్డులో ఇలా..

నిడదవోలు, జనవరి 9 : నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. ఏ రోడ్డులో చూసినా అంతా చెత్తమయం.ఆ రోడ్ల మీద నుంచే ప్రజాప్రతినిధులు, అధికా రులు ప్రయాణిస్తున్నా వారికి కనీసం రోడ్లపై పేరుకుపోయిన చెత్త కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ పరిధిలోని 28 వార్డుల్లో సుమారు 45 వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. పట్టణంలో ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు 91 మంది ఉండగా పర్మినెంటు పారి శుధ్య కార్మికులు 29 మంది మాత్రమే ఉన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం.. ఇంటింటా చెత్త సేకరణ చేయడం మొత్తం 120 మంది విధి నిర్వహణ. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు 91 మంది సమ్మె బాట పట్టడంతో కేవలం 29 మందిపై ఆ భారం పడింది. దీంతో ఎక్కడా చెత్త శుద్ధి కానరావడంలేదు. గత 7 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పారిశుధ్య కార్మికులు మండిపడుతున్నారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో వ్యాధులు ప్రభలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నిడదవోలులో ఇలా..

కొవ్వూరులో కంపు..కంపు



కొవ్వూరులో పేరుకుపోయిన చెత్త

కొవ్వూరు, జనవరి 9 : మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెతో కొవ్వూరు పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పట్టణంలోని ప్రధాన రహదారుల నిండా చెత్తే సంక్రాంతి పండుగ రోజుల కావడంతో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పనులు చేపడతారు. ఇంట్లో ఉన్న పాత సామగ్రి, చెత్తను రోడ్ల పక్కన పడేస్తున్నారు.దీంతో చెత్త విపరీతంగా పేరుకుపోతోంది. కొవ్వూరు మునిసిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు గత నెల 27వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. అంటే సుమారు 15 రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో పట్టణంలో ఎటు చూసినా చెత్త దర్శనమిస్తుంది. కొవ్వూరు మునిసి పాలిటీలో 98 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెకు దిగారు. ప్రస్తుతం 37 మంది రెగ్యులర్ కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో వివిధ పనుల నిమిత్తం 11 మంది వెళ్లిపోతుంటే కేవలం 26 మందిపైనే భారమంతా పడిపోతోంది. పట్టణమంతా స్వీపింగ్, చెత్త సేకరణకు రెండు రోజులు పడుతుంది. దీంతో పారిశుధ్యం అధ్వానంగా తయా రైంది. చెత్త ప్రతిరోజు సేకరించకపోవడంతో రహదారులు అపారిశుధ్యానికి నిలయంగా మారుతున్నాయి.

ప్రభుత్వంతో చర్చలు విఫలం

మంత్రులు, కార్మిక సంఘాల నేతల మధ్య ఈ నెల 6వ తేదీన చర్చలు జరిగాయి.చాలా డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో పారిశుధ్య కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు.

1. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ప్రస్తుతం అందజేస్తున్న వేతనం రూ.15,000లు, హెల్త్ అలవెన్సు రూ. 6000లు కలిపి రూ. 21000లు ఇస్తుంది. దీనికి అదనంగా ఒక నెల బోనస్ లేదా రూ. 3000లు జీతం పెంచాలని అడగ్గా ప్రభుత్వం ఒక్క రూపాయి పెంచేది లేదన్నారు. రాజధాని, విలీన గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్మికులకు రూ. 21,000 వేతనం చెల్లించేందుకు అనుమతించింది.కొత్తగా తీసుకున్న కార్మికుల విషయం తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పింది.
2. జనవరి 1వ తేదీన ఇచ్చిన జీవో పరిధిలోకి వచ్చే పారిశుధ్య డ్రైవర్లు, క్లీనర్లు, అండర్ గ్రౌండ్ పారిశుధ్య కార్మికులకు రూ. 6000 హెల్త్ అలవెన్స్ అమలు చేస్తారు. వారందరికీ క్లీన్ ఎన్విరాన్‌మెంటల్ వర్కర్స్‌గా పేరు పెట్టి భవిష్యత్‌లో రూ. 21000ల బేసిక్‌పై వేతనాలు పెంచుతారు.
3. స్కూల్ స్వీపర్లకు బకాయి వేతనాలు త్వరలోనే చెల్లిస్తారు.
4. ఫైనాన్స్ డిపార్టుమెంటులో పెండింగ్‌లో ఉన్న స్కిల్, సెమీ స్కిల్డ్ వేతనాలు వర్తించే 8 కేటగిరీలకు చెందిన ఫైల్ వారంలో క్లియర్‌చేసి వేతనాలు చెల్లిస్తారు. ఇంజనీరింగ్ కార్మికులకు 11వ పీఆర్‌సీ ప్రకారం బేసిక్ రూ. 20 వేలు చెల్లించాలని కోరగా ప్రభుత్వం తిరస్కరించింది. ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, వాటర్ సప్లయి కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని కోరగా తిరస్కరించింది.
5. సర్వీస్‌లో ఉండి ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ. 5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతారు. సహజ మరణానికి రూ2 లక్షలు అందజేస్తారు.యూజీడీ విభాగంలో వర్కరు ప్రమాదవశాత్తు చనిపోతే సుప్రీంకోర్టు డైరెక్షన్ ప్రకారం అతడికి రూ. 30 లక్షలు, పూర్తి అంగవైకల్యానికి రూ. 20 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ. 10 లక్షలు నష్ట పరిహారం అందజేస్తారు.
6. పర్మినెంట్ వారికి సరెండర్ లీవులు 10 రోజులు ఇస్తారు. జీపీఎఫ్ ఖాతాలు త్వరలో తెరుస్తారు.
7. ఇంజనీరింగ్ విభాగంలో సర్టిఫికెట్స్ లేనివారికి స్కిల్ డెవలప్‌మెంటు ద్వారా శిక్షణ అందించి సర్టిఫికెట్స్ ఇస్తారు.
8. పదేళ్లుల పైబడిన కార్మికులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 50 వేలు అందిస్తారు. 25 ఏళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉంటే ఏడాదికి రూ. 2000ల చొప్పన అదనంగా చెల్లిస్తారు.
9. క్లాప్ ఆటోల డ్రైవర్లకు సంక్రాంతి తరువాత చీఫ్ సెక్రటరి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీలు కార్మికులతో చర్చలు జరిపి వేతనాల పెంపుదలకు చర్యలు తీసుకుంటారు.
10. మట్టి ఖర్చులు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంపు.
11. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలుచేస్తారు. ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదు.

ఇవీ నాయకుల డిమాండ్లు..

1. సమానపనికి సమాన వేతనం.
2. ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి.
3. పర్మినెంట్ చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పడంతో ఔట్ సోర్సింగ్‌లో ఐదేళ్ల అనుభవం ఉన్న కార్మికులందరిని కాంట్రాక్టులోకి మార్చాలి.
4. అందరికి జీతాలు పెంచాలి. 11వ పీఆర్‌సీ లింక్ చేయాలి.
5. జీవోఆర్‌టీ నంబరు 1615 ప్రకారం బేసిక్ డీఏ ఇవ్వాలి.
6. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే వర్కర్లకు రిస్క్ అలవెన్సు హెల్త్ అలవెన్సు ఏదో ఒకటి పెంచి ఇవ్వాలి.
7. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఒక నెల బోనస్ లేదా రూ. 3000లు జీతం పెంచాలి.
8. రూ. 5 లక్షలు గ్రాట్యుటీ అమలు చేయాలి.

అడిగేవాడెవడు..పీకెయ్!

రాజమహేంద్రవరం రూరల్‌లో 33 మంది.. నిడదవోలులో 9 మంది వలంటీర్ల తొలగింపు



నిడదవోలు, జనవరి 9 :మాట వింటే ఓకే.. లేకపోతే షాకే.. ఇదీ సీఎం జగన్ నైజం.. ఇటీవల వలంటీర్లకు వైసీపీ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ల వ్యవస్థను తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిని నియమించింది..గత నాలు గేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్నారు.రాష్ట్రంలో ఎన్నికలు రానున్న తరుణంలో వలంటీర్ల పనితీరు సరిగ్గా లేదనే నెపంతో జిల్లావ్యాప్తంగా ఎందరో వలంటీర్లను పొమ్మనలేక పొగ పెట్టి ఇళ్లకు పంపించేసింది.అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయక పోవడమే ఉద్వాసనకు ప్రధాన కారణమనేది ఒక వలంటీర్ ఆవేదన. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 125 మందిని తొలగించింది. వలంటీర్లను నియమించేది స్థానిక సంస్థలైతే.. తొలగించేది మాత్రం విజయవాడలో ఉన్న వలంటీర్స్ అండ్ సెక్రటరీస్ డిపార్ట్‌మెంటు నుంచి ఆదేశాలు రావడం విశేషం. గతంలో రాజమహేంద్రవరం రూరల్ మండలంలో సుమారు 33 మంది వలంటీర్లను అర్ధంతరంగా తొలగించారు. సమ్మెకు దిగారనే కారణంతో తొలగించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా నిడదవోలులో 218 మంది వలంటీర్లు ఉండగా 9 మందిని తొల గించారు. దీనిపై వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లకు విధి నిర్వహణకు నిర్దిష్ట సమయం లేకపోయినా ఒకటో తేదీ తెల్లవా రుజాము నుంచే పింఛన్లు పంపిణీ చేస్తారు.వలంటీర్లల సేవల్లో ఎక్క డైనా లోపం తలెత్తితే సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించకుండా ఇటికి పంపించేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగులు తప్పు చేస్తే వలంటీర్లలాగే ఈ వైసీపీ ప్రభుత్వం వారిని కూడా ఇంటికి పంపిస్తుందా అంటూ వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. అధికారపార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తితేనే వలంటీర్లుగా కొనసాగగలమని లేకపోతే ఇంటికి వెళ్లక తప్పదనేది వాలంటీర్ల వాదన. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల విధుల నుంచి తమను ఎందుకు తొలగించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు బెదిరింపులు

- అంగన్‌వాడీ ఉద్యోగులకు నోటీసులు
- నాలుగు రకాలుగా అందించే వైనం
- పాఠశాలలకు సెలవు.. పిల్లలకు భోజనమెలా
- సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లదే వంట



రాజానగరంలో పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ ఉద్యోగులను రకరకాలుగా భయపెడుతున్న ప్రభుత్వం నోటీసులిస్తోంది. ఎస్మా ప్రయోగించినప్పటికీ ఉద్యోగులు దిగిరాకపోవడంతో పాటు ఉద్యమాన్ని ఉధృతం చేసిన సంగతి తెలిసిందే.గత 28 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకూ 24 గంటల నిరవధిక సమ్మె చేశారు. దీనిలో భాగంగా చలిలో పిల్లలతో కలిసి నిద్రించి నిరసన తెలిపారు. ఎస్మా జీవో పత్రాలను ఇప్పటికే అనేక చోట్ల దహనం చేశారు. రోజురోజుకు ఆందోళన ఉధృతమవుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు విధుల్లో చేరాలని నోటీసులు ఇస్తున్నారు. రెండు రోజులుగా నోటీసులివ్వడం మొదలు పెట్టారు.వీటిని నాలుగు రకాలుగా వారికి అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక నోటీసును అంగన్‌వాడీ కేంద్రం వద్ద గోడకు అతికిస్తారు. ముందుగా ఫోన్ చేసి కూడా చెబుతారు. అక్కడకు రాకపోతే సచివాలయ ఉద్యోగులు స్వయంగా ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేస్తారు. అక్కడ సదరు ఉద్యోగి లేకపోతే ఇంటి గోడకు అతికిస్తారు. ఇరుగుపొరుగుకు చెందిన ఇద్దరి చేత సంతకం చేయించుకుంటారు. అంతేకాక ప్రభుత్వం రిజిస్టర్‌పోస్టులో కూడా నోటీసు పంపించే పనిలో ఉంది.ఐసీడీఎస్ ఉద్యోగుల ద్వారా కూడా నోటీసులు ఇవ్వనున్నారు. ఇలా కొంతమందినైనా భయపెడితే డ్యూటీలో చేరతారనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. కానీ తమ జీతం పెంచకుండా, తమ సమస్యలు పరిష్కరించకుండా తాము డ్యూటీకి రాలేమని, పరిష్కారం దొరికే వరకూ సమ్మెలోనే ఉంటామని చెబుతున్నారు.అక్కడక్కడా వైసీపీనేతలు, అధికారుల ఒత్తిడి వల్ల ఒకరో ఇద్దరో విధులకు హాజరవుతుండడం గమనార్హం. కానీ జిల్లాలో 15 వేల సెంటర్లలో సుమారు 30 వేల మంది వరకూ ఉద్యోగులు ఉన్నారు. వారు నోటీసులను కూడా తిరస్కరిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా వంటా వార్పు బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై పడింది. ఇటీవల పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇచ్చి సంగతి తెలిసిందే. అంతకు ముందు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం కింద పిల్లలకు పెట్టే భోజనం కొంత తెచ్చి, ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఏదో పెట్టినట్టు పని పూర్తి చేశారు.పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో సొంతంగా వండి పెట్టవలసిన పరిస్థితి వచ్చింది.

అన్నింటికీ తెగించే సమ్మెలోకి వచ్చాం

అంగన్వాడీల సంఘు జిల్లా ప్రధాన కార్యదర్శి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాకు అంగన్వాడీలు భయపడరని, అన్నింటికీ తెగించే సమ్మెలోకి వచ్చాం అని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట 29వ రోజున మంగళవారం అంగన్వాడీల నిరవధిక సమ్మె కొనసాగింది. ప్రభుత్వం కాలయాపన చేయకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రులు, సలహాదారులు, ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీల పట్ల బెదిరింపులకు దిగుతున్నారని, అయినా ఏ ఒక్కరూ వెనుకడుగు వేయలేదన్నారు. అంగన్వాడీల దీక్షకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నామణి, కోశాధికారి వెంకటలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా మద్దతు పలికారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : సమస్యలు పరిష్కరించకపోతే 23వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని 108 ఉద్యోగులు హెచ్చరించారు. ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జేసీ తేజ్‌భరత్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ, జిల్లా కార్యదర్శి గుజ్జుల రమేష్‌బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు వీఎస్ నారాయణ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న తమను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరుస్తామని జగన్మోహనరెడ్డి 2019లోనే హామీ ఇచ్చారని, నాలుగేళ్ల నుంచి సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, రమేష్‌నాయుడు, నాగరాజు, లోహి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో మూడుసార్లు సర్వేలు నిర్వహించినట్టు చెబుతున్నారు.అది ప్రజల్లో చేసిన సర్వే.వాటి తర్వాత ప్రస్తుతం పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఇంట్రేక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) ద్వారా సర్వే చేస్తున్నారు.కార్యకర్తలకు ఫోన్‌లు వస్తాయి.ఫలానా వ్యక్తిపై మీ అభిప్రాయం ఏంటని అడుగుతారు.దానికి వాళ్లు ఇచ్చిన ఆప్షన్ మేరకు అభిప్రాయం చెప్పాలి.ఇప్ప టికే గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలులో ఐవీఆర్ఎస్ సర్వే జరిగింది. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదు.ఈలోపు మరింతగా అభి ప్రా యాలు తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేస్తారు.టీడీపీ -జనసేన పొత్తు వల్ల కొన్ని సీట్లను జనసేనకు కేటాయించనున్నారు.అవి ఎన్ని అనేది స్పష్టత లేదు.

షోకాజులకు బెదిరేది లేదు : ఎస్ఎస్ఏ

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తామని బెదిరిస్తున్నారని.. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకూ అలాంటి హెచ్చరికలకు తలొగ్గేది లేదని సమగ్ర శిక్షా ఉద్యోగులు స్పష్టం చేశారు.జేసీ తేజ్‌భరత్‌కు వినతి పత్రం సమర్పించా మని తెలిపారు. 21వ రోజు సమ్మెను కొనసాగించారు. రాష్ట్ర జేఏసీ సూచనల ప్రకారం నడుచుకుంటామని జిల్లా జేఏసీ నాయకులు పేర్కొ న్నారు. తొలుతగా అనకాపల్లి జిల్లా మునపాక మండల విద్యాశాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ మృతి చెందిన జిడ్డు వాసు దేవరావుకు నివాళులర్పిస్తూరెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

వైసీపీ గెలిచేది ఐదు సీట్లే!

- 170 స్థానాల్లో టీడీపీదే విజయం
- వైసీపీ డౌన్‌ఫాల్ ఆరంభమైంది
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: రాష్ట్రంలో వైసీపీకి 5 స్థానాలు మాత్రమే ఎందుకు రాకూడదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారని మీకు వైనాట్ 175 అని ప్రశ్నించారు. 170 టీడీపీకి వస్తాయని పైన ఆ ఐదు సీట్లు ఖచ్చితంగా వైసీపీకి రావొచ్చునని చెప్పారు. ఈ రోజు మొదలుకొని వైసీపీ డౌన్‌ఫాల్ ఆరంభమైందన్నారు. ఇప్పటికే అనేక తప్పిదాలు చేసిన సీఎం జగన్‌తో సహా ఆయన సలహాదారులు, ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు భయపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఇష్టానుసారం వ్యవహరించే అధికారులు వారి పద్ధతి మార్చుకోవాలన్నారు. కేంద్రం దయ వల్ల జగన్ బెయిల్‌పై బయట ఉన్నాడనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏమిచేశాడో తెలియడంలేదన్నారు.సంక్షేమం ముసుగులో దోపిడీ చేశాడని ధ్వజమెత్తారు. వాగ్దానాలు చేసి మాట ఇచ్చి మడమతిప్పిన ఈ సీఎం వల్ల ఎస్ఎస్ఏ ,అంగ న్వాడీలు , మునిసిపల్ కార్మికులు రోడ్డుపాలయ్యారని చెప్పారు. అప్పులు పెంచాడు తప్ప రాష్ట్రాన్ని ఉద్ధరించలేదన్నారు. శాడిస్ట్ ముఖ్యమంత్రి జగన్, శాడిస్ట్ సలహాదారులు రాష్ట్రాన్ని అబాసుపాలు చేశారని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఉరి వేశాడని విమర్శించారు. ఇలాంటి సీఎంను ఏ రాష్ట్రం కూడా చూసి ఉండదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తలారి మూర్తి , పిన్నింటి ఏకబాబు, ప్రత్తిపాటి రామారావు చౌదరి పాల్గొన్నారు.

పండుగ సెలవులు తీసిన ప్రాణాలు!





ఆనందం ఆవిరైంది.. సరదా ప్రాణం తీసింది.. పండుగ సెలవుల తొలిరోజే ముగ్గురు విద్యార్థుల ప్రాణాలు బలిగొన్నాయి. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రంపచోడవరం మండలం ఐ. పోలవరం వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వెళ్లారు. చాలా సేపు సరదాగా గడిపారు. ఫొటోలు తీసుకుంటుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. దేవరపల్లి యర్నగూడెంలో ట్రాక్టర్ కిందపడి మరో విద్యార్థి మృతిచెందాడు. - వివరాలు 8లో

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

చాగల్లులో మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం



ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

చాగల్లు, జనవరి 9: ప్రజారోగ్య వ్యవస్థ పరితీరును నేరుగా పరిశీలించేందుకు వైద్యఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో తనిఖీ నిర్వహించింది. డీపీఎంఎస్‌వో డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జిల్లా గణాంకాధికారి ఊజే కుమారస్వామి, డీపీహెచ్ఎన్‌వో వసంతలక్ష్మి, డీపీవో సంధ్యారెడ్డిలతో కూడిన బృందం స్థానిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు పలు రకాలైన వైద్యసేవలు ఏవిధంగా అందుతున్నాయో పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.మనోజ్, పీహెచ్ఎన్ షేక్ జమీల పాల్గొన్నారు.

విజ్జేశ్వరం బ్యారేజ్ రోడ్డుకు శంకుస్థాపన

కొవ్వూరు, జనవరి 9: మండలంలోని సీతంపేటలో విజ్జేశ్వరం బ్యారేజ్ రోడ్డు నిర్మాణానికి హోం మంత్రి తానేటి వనిత మంగళవారం శంకుస్థాపన చేశారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1.76 కోట్లతో విజ్జేశ్వరం బ్యారేజ్ లాకు నుంచి ధవళేశ్వరం బ్యారేజ్ వరకు రోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు. అలాగే పశివేదలలోని అంబేడ్కర్ కాలనీలో సొసైటీ డైరెక్టర్ దాసరి వెంకటరాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని మంత్రి వనిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిడదవోలు రైల్వేస్టేషన్‌లో ఉద్యోగుల రిలే దీక్షలు

నిడదవోలు, జనవరి 9: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి ఎన్‌పీఎస్‌ను తీసివేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిడదవోలులోని రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం ఎన్ఎఫ్ఐఆర్, ఏసీఆర్ఈఎస్ ఆధ్వర్యంలో రిలే నిరవధిక దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే యూనియన్ నాయకుడు వి.సోమేశ్వరరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం బ్రాంచి పరిధిలోని రైల్వే డిపార్టుమెంటు కార్మికులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న జరిగే రిలే హంగర్ ఫాస్ట్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

దేవరపల్లి, జనవరి 9: మానవత సంస్థ మండల గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య దేవరపల్లి బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం కళాశాలలో బీఎస్సీ చదువుతున్న సాయిలలితకు సైకిల్‌ను అందజేశారు. దేవరపల్లిలో మంగళవారం రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతారామయ్య దంపతులను సత్కరించారు.కార్యక్రమంలో ఈద్పూగంటి నాగేశ్వరరావు, ఆచంట సుభాష్‌చంద్రబోస్, కేశిరాజు రాజ్‌కుమార్, పప్పు వెంకటరామారావు, బండి సూర్యప్రకాశరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణానికి మార్కింగ్

నిడదవోలు, జనవరి 9: నిడదవోలులో నిర్మించనున్న ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి మంగళవారం ఆర్అండ్‌బీ అధికార్లు, డివిజినల్ సర్వేయర్లు పట్టణంలోని మెయిన్‌రోడ్డులో వ్యాపార సముదాయాలకు మార్కింగ్ వేశారు. సంక్రాంతి అనంతరం మార్కింగ్ ప్రకారం వ్యాపార సంస్థల యజమానులు తమ దుకాణాలను సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజినల్ సర్వేయర్ రామకృష్ణ, ఆర్అండ్‌బీ ఏఈఈ శ్రీనివాస్‌విజయ్ తదితర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

తాళ్లపూడి, జనవరి 9 తాళ్లపూడి కరిబండి విద్యా సంస్థల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు పలు వేషధారణల్లో అలరించారు. కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

గోపాలపురం: గోపాలపురంలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ గుడూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలు వేసి పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్

నల్లజర్ల, జనవరి 8: విశ్రాంత ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించవలసిన కరువు భత్యం, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగులు అసోషియేషన్ మండలాధ్యక్షుడు ఐవీ సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం నల్లజర్ల హైస్కూల్లో జరిగిన విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ నివేదిక అందేలోపు 30శాతం మధ్యంతర భృతి అందించాలన్నారు. 30మంది సభ్యులకు ఉచితంగా జీవన్ ప్రమాన్ పత్రాలు చేయించారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఎస్ఎం ఆలీసాహెబ్, ప్రసాద్, ప్రభుదాసు, ఎన్.రాజేంద్రప్రసాద్, ఎస్.బాలయ్య, ఐడీవీ అప్పారావు పాల్గొన్నారు.

నల్లజర్ల పీఎంపీ అసోసియేషన్ సమావేశం

నల్లజర్ల, జనవరి 9: పీఎంపీలు తమ పరిధులు దాటకుండా గ్రామ సహాయకులుగా సేవలందించాలని పీఎంపీ అసోషియేషన్ మండలాధ్యక్షుడు బోడిగడ్ల సీతారాములు అన్నారు. మంగళవారం నల్లజర్ల స్టార్ గ్రాండ్‌లో తాడేపల్లిగూడెం యూనియన్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలువలు పాటిస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఆసుపత్రి ఎండీ కళ్యాణ్‌చక్రవర్తి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు అనందం సుబ్బారావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరులు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బల్ల శ్రీనివాస్, కార్యదర్శి దేవానంద్ మండల కార్యదర్శి ధనంజయరావు, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘ నూతన కమిటీ ఎన్నిక

ఉండ్రాజవరం మండలాధ్యక్షుడిగా జోష్యుల సుబ్రహ్మణ్యం

ఉండ్రాజవరం, జనవరి 9: బ్రాహ్మణ సంఘ మండల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం ఉండ్రాజవరంలో నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మంచిరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండలాధ్యక్షుడిగా జోష్యుల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్ ఎన్నికయ్యాకు. వీరితోపాటు పి.వీఎస్ ప్రసాద్ కన్వీనర్‌గా, మండల యువజన సంఘ అధ్యక్షుడిగా పొట్లచెర్వు రాధాకృష్ణ, సహాయకార్యదర్శిగా వై.అచ్యుతరమేష్, మహిళా మండల కన్వీనర్‌గా ఏలూరుపాటి సుబ్బలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సంతకాల సేకరణ

ఉండ్రాజవరం, జనవరి 9: విజయవాడలో ఈనెల 19 నెలకొల్పే బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటు సందర్భంగా సంతకాలు సేకరణలో భాగంగా మండలంలోని పాలంగిలో మంగళవారం కొవ్వూరు డీఎల్‌పీవో వై. అమ్మాజీ సంతకం చేశారు. ఉండ్రాజవరం, పాలంగి పంచాయతీలకు వచ్చిన సందర్భంగా ఆమె ఫ్లెక్సీపై సంతకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

గోపాలపురం, జనవరి 9: సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. వెదుళ్లకుంట గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న సారాబట్టీపై మంగళవారం దాడి చేసి 30లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు తెలిపారు. సారా తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

'జాన్ పీటర్‌ను బదిలీ చేయాలి'

దేవరపల్లి, జనవరి 9: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ రెండు కులాల మధ్య వివక్ష చూపుతున్నారని గౌరీపట్నం గ్రామానికి చెందిన బడుగు వీర్రాజు, కర్రి కొండయ్య, గోతం చంద్రరావు, మార్పు సంపతరావు, టేకుమూడి సంపత్ ఆరోపించారు. మంగళవారం సాయంత్రం జాన్ పీటర్ నివాసం వద్ద గ్రామానికి చెందిన రోమన్‌కెథలిక్ సంఘానికి చెందిన తమకు ప్రాధాన్యమివ్వడంలేదని, మూడున్నరేళ్లలో గుడి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. షాపులు అద్దెకిచ్చే క్రమంలో రెండు సామాజిక వర్గాల మధ్య పక్షపాతం చూపిస్తున్నారని విమర్శించారు. ఫాదర్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ శ్రీహరిరావు, ట్రైనీ డీఎస్పీ భానోదయ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేసేవారితోనూ, జాన్‌పీటర్‌తోనూ చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు.

నేడు మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

రాజానగరం, జనవరి 9: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఈ నెల 10న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో ఎం.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. సచివాలయ పరిధిలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని, 20వ తేదీ వరకు ఈపోటీలు జరుగుతాయని చెప్పారు. ఆటల పోటీలు నిర్వహించే జట్ల వివరాలు, ఆడాల్సిన తేదీలు, సమయం తదితర వివరాలను ఆయా గ్రామ సచివాలయాలకు పంపించామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ప్రభుత్వం సరఫరా చేసిన టీ షర్టులు, క్యాప్‌లు ధరించి పోటీలకు హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల నిరసన

కొవ్వూరు, జనవరి 9: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీలు ఇవ్వకుండా సమ్మె విరమింపచేయాలని కోరడం సబబు కాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు 15వ రోజు సమ్మెను కొనసాగించారు. యూనియన్ నాయకుడు భూపతి రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించకుండా ఒకటి, రెండు అంశాలకు ప్రాధాన్యమిచ్చి సమ్మెను ముగించాలని కోరడం అన్యాయమన్నారు. ఇంజనీరింగ్, వివిధ విభాగాల్లో పనిచేసే కార్మికుల అంశాలపై ప్రభుత్వం చర్చించి ఒక నిర్ణయానికి రావాలన్నారు. రెండేళ్ల క్రితం సమ్మె చేసినప్పుడు చెప్పిన మాటలే ఇప్పుడూ చెబుతున్నారన్నారు. మున్సిపాల్టీలలో పని



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు



నిడదవోలులో నిరసన తెలుపుతున్న కార్మికులు

చేస్తున్న అన్ని విభాగాల కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజాన అప్పారావు, మీసాల కిషోర్, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, పూజారి వాసు, కారింకి ప్రసాద్, మీసాల జ్యోతి, ముత్యాల శ్రీను, వడ్డాది శ్యాం, అల్లం విజయకుమార్ పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల సమ్మె 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు రేఖా భాస్కరరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాముదూరి నాగేంద్ర వరప్రసాద్, ఎమ్.హరీష్, కాకి అప్పలరాజు, బొచ్చా ముద్దుకృష్ణ, బండారు రాంబాబు, బంగారు జగ్గమ్మ తదితర్లు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలి

» నిడదవోలులో న్యాయవాదుల ర్యాలీ

నిడదవోలు, జనవరి 9: ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులడు ములగాల రవికుమార్ అన్నారు. మంగళవారం నిడదవోలులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద నుంచి న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. గణేష్‌చౌక్ సెంటర్ వద్ద రోడ్డుపైనే కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూహక్కు చట్టం భూకబ్జాదారులకు పూర్తిగా అనుకూలంగా ఉందని, సన్న, మధ్యకారు రైతులకు తీవ్రనష్టం జరుగుతుందని, ప్రభుత్వం స్పందించి ఈ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, జనసేన నాయకులు రంగా రమేష్, కాంగ్రెస్ నాయకుడు పెద్దిరెడ్డి సుబ్బారావు, బీఎస్పీ నాయకుడు బయ్యే మునీంద్ర, కేవీఎన్‌పీఎస్ నాయకుడు గెడ్డం రవీంద్రబాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని చిట్యాలలో నూతంగి దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సీనియర్ న్యాయవాదులు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. న్యాయస్థానాల పరిధి తగ్గించి స్థిరాస్తి తగదాల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగాన్ని ఆశ్రయించాలనడం సరికాదన్నారు. ఈ చట్టం అమలుతో సొంత భూమిని కూడా రైతులు కాపాడుకోలేని దుస్థితి దాపురిస్తుందన్నారు. ఒక వ్యక్తి స్థిరాస్తిని తనకు తెలియకుండా ఏ ఇతర వ్యక్తైనా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రెండేళ్ల లోపు భూయాజమాని అభ్యంతరాన్ని తెలుపకపోతే ఆ భూమి కబ్జాదారుల చేతికి చిక్కినట్లే అన్నారు. సన్న, చిన్నకారు రైతులు భూమిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు బార్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు కొడూరి సూర్య రాఘవులు, న్యాయవాదులు నంబూరి శ్రీమన్నారాయణ, దుగ్గిరాల తాతారావు, ఏలూరి గోపాలకృష్ణ, పిల్లలమర్రి గోపాలకృష్ణ, వెంకట్రావు, గంధం నరసింహా రావు, కృష్ణారావు, సత్యవేణి, పవన్‌కుమార్, సూర్యప్రకాశ్, రైతులు గద్దే శ్రీను, గద్దే హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఉచిత బస్సు పథకం వద్దంటూ ర్యాలీ



తాళ్లపూడిలో పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు

తాళ్లపూడి, జనవరి 9: ఎన్నికల వేళ పక్క రాష్ట్రంలో మాదిరిగా ఉచిత బస్సు పథకం పెట్టి ఆటో కార్మిక కుటుంబాల పొట్ట కొట్ట వద్దంటూ మండలంలోని ఆటో కార్మికులు మంగళవారం ర్యాలీ చేపట్టారు. తాళ్లపూడిలో బస్టాండు నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్‌కు, ఎంపీడీవోకు, పోలీసులకు వినతిపత్రాలు అందించారు. యూనియన్ నాయకుడు రజనికుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికులు 25 ఏళ్లుగా ఆటోలు తోలుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఉచిత బస్సు పథకం అమలు చేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఒకరికి మేలు చేస్తూ మరోకరికి పొట్టకొట్టే పథకాలు పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గోపాలపురం: ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గోపాలపురం న్యూఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిలో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.



గోపాలపురంలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

'బెదిరింపులకు భయపడం'



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కొవ్వూరు, జనవరి 9: ప్రభుత్వం ఎన్నిరకాలుగా బెదిరించినా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట 29వ రోజు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. మాణిక్యాంబ మాట్లాడుతూ కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 100శాతం అంగన్వాడీ కేంద్రాలు మూసివేసి సమ్మెను కొనసాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికయినా బెదిరింపు చర్యలను మానుకుని సమస్యల పరిష్కారం దిశగా ఆలోచన చేయాలన్నారు. అంగన్వాడీల సమ్మెకు మాజీ డిసిసి అధ్యక్షులు ఎం.డి. రఫీ యుల్లాబేగ్, టీడీపీ నాయకులు ఎం.రాజు, పి.జయరాజులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్ పుష్పావతి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, డి.అమరావతి, సీహెచ్.బ్రహ్మమ్మ, వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి, ఎం.మంగతాయారు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలో అంగన్వాడీలు చేపట్టిన దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. మండలాధ్యక్షురాలు రామలక్ష్మి మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలపై ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. అంగన్వాడీల మధ్య చిచ్చుపెట్టి ఉద్యమాన్ని నీరుకార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా తమ డిమాండ్ల పరిష్కారమే ధ్యేయంగా సమ్మె కొనసాగిస్తామన్నారు.



గోపాలపురంలో మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

వీఆర్‌కు నల్లజర్ల సీఐ,ఎస్ఐ

సీఐగా దుర్గాప్రసాద్,ఎస్ఐగా వెంకటసురేష్



సీఐ దుర్గా ప్రసాద్



ఎస్ఐ వెంకట సురేష్

నల్లజర్ల, జనవరి 9: ఇప్పటి వరకు నల్లజర్ల సీఐగా కొనసాగిన నున్న రాజు ఏలూరు వీఆర్‌కు, ఎస్ఐగా పని చేసిన నరసింహమూర్తి రాజమహేంద్రవరం వీఆర్‌కు బదిలీ అయ్యారు.ఇదిలా ఉండగా నల్లజర్ల సీఐగా కె.దుర్గాప్రసాద్, ఎస్ఐగా టి.వెంకట సురేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సామర్లకోట సీఐగా పని చేసిన దుర్గా ప్రసాద్ బదిలీపై నల్లజర్ల వచ్చారు. రాజమహేంద్రవరం సీసీఎస్ ఎస్ఐగా పని చేసిన టి.వెంకటసురేష్ నల్లజర్ల ఎస్ఐగా బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై దృష్టి పేకాట,కోడిపందేలను నియంత్రిస్తామన్నారు. సంక్రాంతి పండుగలో సాంప్రదాయ క్రీడాలవైపు యువత దృష్టి పెట్టాలన్నారు. కళాశాలల వద్ద మాఫ్టీలో పోలీసింగ్ నిర్వహిస్తామన్నారు. కక్షిదారులు నేరుగా తమను సంప్రదించాలని, దళారుల మాటలు నమ్మవద్దన్నారు. మరిన్ని వివరాలకు తన ఫోన్ నెంబరు 9440796614 సంప్రదించాలన్నారు.

దేవరపల్లి సీఐగా రామకృష్ణ



సీఐ రామకృష్ణ

దేవరపల్లి, జనవరి 9: దేవరపల్లి సీఐగా కె.రామకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం సీఐగా పనిచేస్తూ బదిలీపై దేవరపల్లి వచ్చారు. గతంలో ఆయన దేవరపల్లి, పాలకొల్లు, కొడూరు, చింతలపూడి, కొవ్వూరు రూరల్ ఎస్ఐగా పనిచేశారు. దేవరపల్లి సీఐగా పని చేసిన అనసూరి శ్రీనివాసరావు కడియం సీఐగా బదిలీపై వెళ్లారు. మంగళవారం సాయంత్రం కాకర్ల కల్యాణ మండపంలో సీఐ అనసూరి శ్రీనివాసరావుకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ వర్మ, దేవరపల్లి ట్రైనీ డీఎస్పీ భానోదయ, దేవరపల్లి ఎస్ఐ శ్రీహరిరావు, గోపాలపురం ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో పనికి వెళ్లి మృత్యువాత

రోడ్డు గోతుల్లో పడిన ట్రాక్టర్.. యువకుడి మృతి



మృతిచెందిన కె.సంగీత్‌కుమార్

దేవరపల్లి, జనవరి 9: చదువుకుంటూ సెలవు రోజులు కావడంతో కూలిపనికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన ఏడుగురు యువకులు స్నేహితులు. వేర్వేరు చోట్ల చదువుకుంటున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో పనిలోకి వెళ్దామనుకున్నారు. మంగళవారం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ట్రాక్టర్‌లో కొబ్బరాకులు లోడు చేసుకుని మధ్యాహ్నం తిరిగి కలవలపల్లి బయలుదేరారు. ట్రాక్టర్ లోడుపై నలుగురు, ట్రాక్టర్ ఇంజన్ మధ్యలో ఉన్న రాబర్ పైన ముగ్గురు నిలుచున్నారు. త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు గోతులమయంగా ఉంది. ఎదురుగా వస్తున్న చెరుకు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రాబర్‌పై కూర్చున్న వారిలో కోడి సంగీత్‌కుమార్(19) ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ అతని పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సంగీత్‌కుమార్ నిడదవోలులో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి కూలి పనికి వెళ్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సంఘటన ప్రాంతాన్ని ట్రైనీ డీఎస్పీ భానోదయ పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ భానోదయ

దేవరపల్లి, జనవరి 9: మండలంలోని బందపు రంలో పోలవరం కాల్వ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాల్వలో పడి చెందాడు. పోలీసుల వివరాల మేరకు బంధపురానికి చెందిన బయ్యా రామకృష్ణ(39) ఈ నెల 7వ తేదీ ఉదయం ఇంటి నుంచి కూలిపనికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుమారుడు వెతకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో స్థానిక పోలవరం గట్టు మీద తన తండ్రి చొక్కా, లుంగి కనిపించాయి.. కాల్వలో చూడగా తండ్రి చనిపోయి ఉన్నట్టు గుర్తించాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ట్రైనీ డీఎస్పీ భానోదయ తెలిపారు.

తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తాం

» మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9: ముఖ్యమంత్రి జగన్ గారు రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలు ఇప్పటికైనా పరిష్కరించి సమ్మెను విరమింపజేస్తారా లేక తాడేపల్లి ప్యాలెస్ ముట్టడించ మంటారా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు.రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మికుల సమ్మె లో భాగంగా 6వ రోజు మంగళవారం కలిసి మద్దతు తెలిపారు. పారిశుధ్య కార్మికులు సమ్మెతో ఆగిన పనులు చేయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయింపులు చేసే కంటే డిమాండ్స్‌ను నేరవేరిస్తే మంచిదన్నారు. జగన్ ఇచ్చిన హామీలనే నేరవేర్చకుండా ద్రోహం చేశారన్నారు. నిర్లక్ష్యం వీడకపోతే రెగ్యులర్ కార్మికులు చేసే పనులను ఔట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకుంటారని హెచ్చరించారు.మరొక పక్క నగరంలో చెత్త పేరుకుపోవడంతో పారిశుధ్య కార్మికులు సమ్మెను విరమింపచేయాలని కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని కార్మిక నేతలు తెలిపారు. మహా ధర్నాలో కార్మికులు మోకాళ్ళపై నడిచి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రెడ్డి రమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద, ఎం శివ, గిరి, భాగ్యలక్ష్మి, ముత్యాల పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీలను చిత్తుగా ఓడించాలి

» రైతులు, కార్మికులు, వర్కర్లను విస్మరించిన పార్టీలు

» జగన్‌లాంటి నియంత మరొకరు ఉండరు

» 2024 ఎన్నికలు దేశ ప్రజలకు చాలా కీలకం

» ఏపీ రైతు సంఘం రాష్ట్ర సభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : రైతాంగ సమస్యలపై ప్రతి ఒక్కరూ రాజీలేని పోరాటం చేయాలని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని రాష్ట్రంలో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రైతు ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రరంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు రెండో రోజైన మంగళవారం హాజరై మాట్లాడా రు. ప్రభుత్వాలకు కార్పొరేట్ కంపెనీలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సబ్సిడీలు కూడా ఇవ్వకపోవడంతో రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ రామమందిరాన్ని తెరపైకి తెచ్చారని, అయోధ్య రామమందిరంలో విగ్రహప్రతిష్ఠకు వేలకోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలు దేశప్రజలకు చాలా కీలకమైనవని, లౌకికవాదం కావాలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న బీజేపీ కావాలో ప్రజలు తేల్చుకోవాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన ముఖ్యమంత్రులతో పోల్చుకుంటే జగన్మోహనరెడ్డిలాంటి నియంత మరొకరు లేరన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఏ ఒక్క హామీ జగన్ అమలు చేయలేదన్నారు. దీంతో వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలో వర్కర్లు, ఉద్యోగస్తులు సమ్మెబాట పడితే జగన్మోహనరెడ్డి పోలీసులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మా నాయకుడు మాట తప్పడు, మడమ తప్పడు. మోకాలు తిప్పడు, ఏం చెబితే అది చేస్తాడు అంటూ వైసీపీ నేతలు పదే పదే భజన చేస్తుంటారని, కానీ జగన్మోహనరెడ్డి చట్టాన్ని అంగీకరించడు, కోర్టు చెప్పింది వినడు. చివరకు తాను చెప్పింది కూడా అమలు చేయడు అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, ఆయా జిల్లాల రైతు ప్రతినిధులు మాట్లాడారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రామచంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కాటమయ్య, దేగా ప్రభాకర్, జమలయ్య, లక్ష్మి, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛను విధానం రద్దు చేయాలి

రైల్వే ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛను విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరు ద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఎంప్లాయిస్ సంఘ్ పిలుపు మేరకు రైల్వే ఉద్యోగులు రైల్వే స్టేషను ఆవరణలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు వెంటనే నిర్ణయం ప్రకటించాలని నినాదాలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య, విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు దిశానిర్దేశంతో పోరాటం సాగిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు.సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో కూడా నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమంలో వి.త్రినాథ్, ఎస్ఎస్ చంద్రమౌళి, జేడీ ప్రసాద్, టి.నాగేంద్రరావు, అరవ నాగేంద్ర కుమార్, డి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు

సరదాగా వెళ్లి.. నిర్జీవులుగా ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాడేరు జిల్లాలోని రంపచోడవరం దగ్గరలో ఉన్న సీతపల్లి వాగు ఇద్దరు విద్యార్థులను మింగేసింది. కన్నీరు ఉబికి వచ్చే విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మొదటి ఏడాది ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం(8)తో పూర్తయ్యాయి. 11వ తేదీ నుంచి సెలవులు. దీంతో 10మంది విద్యార్థులు ప్లెజర్ ట్రిప్ ప్లాన్ చేసుకున్నారు. కాలేజీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతుండడంతో ఐదుగురు విద్యార్థులు ఆగిపోయారు. మొదటి ఏడాది బీబీఏ(డిజిటల్ మార్కెటింగ్) చదువుతున్న ముగ్గురు అమ్మాయిలు, బీకాం చదువుతున్న ఇద్దరు అబ్బాయిలు ద్విచక్ర వాహనాలపై రంపచోడవరం వైపు వెళ్లారు. సీతపల్లి వాగులో కేరింతలు కొడుతూ గడిపారు. అయితే, షేక్ జబీర్(19) రాయి పైనుంచి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తూ జారి వాగులో పడిపోయాడు. అక్కడ లోతుగా ఉండడంతో కేకలు వేస్తుండగా రక్షిద్దామని వెంటనే సుభర్షిని(19) వాగులోకి దూకింది. అయితే, ఇద్దరూ ప్రవాహంలో గల్లంతయ్యారు. మిగతా ముగ్గురూ కేకలు వేయడంతో స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రంపచోడవరం పోలీసులు చేరుకొని గాలింపు చేపట్టారు. రెండు మృతదేహాలను బయటకు తీసి రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	డెవిల్
వై.స్క్రీన్ 2	సలార్
దేవిశ్రీ(గాయత్రి)	హాయ్ నాన్న
అనన్య	సలార్
నిడదవోలు	
వీ మ్యాక్స్	డెవిల్
రాధాకృష్ణ	హాయ్ నాన్న
శ్రీగణపతి	సలార్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్